నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

**నమ్మలేని నిజాలు**

పులికిమాంసం
నైజం మారింది నేడు
కంకణం కథ.

ప్రజల కవి
మంచి చెడుల హంస
రాజ్యంపై విల్లు.

ఆలోచనలు
కొమ్మమీది మర్కటం
గొప్పమేధావి.

దానధర్మాలు
దొరల పథకాలు
రాచ ఎత్తులు

కొత్తగుంపులు
పాలపుంత జిలుగు
జనంబేజారు



**- రేడియమ్**
సెల్: 9291527757

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com
E-mail : netinijam93@gmail.com

**శ్రీనిజాలు**

డబ్బు పంచుతుంటె వాళ్ళు
లేనిపోని చెకింగ్ !
ఓట్ల కొరకు మున్ముందుగ
చేసుకోండి బుకింగ్ !

ఉన్నోడే పంచుతాడు
వేలకోట్ల సంచులు !
సామాన్యులు నిలబడితె
రాలు దోతి అంచులు !




**- కందుకూరి శ్రీరాములు**
సెల్:9440119245

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

హైదరాబాద్ | గురువారం 10-11-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :29 | సంచిక: 75 | పేజీలు:6 | వెల: రూ.1/-

(పలు సందర్భాలలో ప్రముఖుల స్పందనలు.. సేకరణ డా॥ మాడభూషి శ్రీధర్)

# పత్రికా పదకోశం, కదిలించే నిఘంటువు వరదాచారి



ఉన్నతోన్నతుడు. ఉత్తముడు. అసలైన వ్యక్తిత్వానికి ఆయన అడ్రస్. మహానుభావుడు. మనందరికి ఆత్మీయుడు. మంచి పెద్దమనిషి,

ఆయననే జి.ఎస్. వరదాచారి.

తెలుగు జర్నలిజం కోర్సు పుస్తకాలను వరదాచారి రచించినారు. అనేక పుస్తకాలకు సంపాదకమండలి సభ్యుడిగా (పత్రికా పదకోశం) ఉన్నాడు. పత్రికలు రూపొందించే అందరికీ నేర్పే పుస్తకాలు ఆయన తయారు చేసారు. అవి...ఇలాగేనా రాయడం (2003), దిద్దుబాటు (2003), నార్ల వెంకటేశ్వరరావు (2009), మన పాత్రికేయ వెలుగులు (2010) జ్ఞాపకాల వరద (2017). పుస్తకాలు ముద్రించారు.

వరదాచారి 2022, నవంబరు 3న కాల ధర్మం చెందారు.

పాత్రికేయులలో ఏ సందేహం వచ్చినా, ఫోన్ చేసినా కూడా సరైన సమాధానం చెప్పే నిఘంటు పండితుడు.

వరంగల్లులో ప్రముఖ పాత్రికేయుడు ఎం ఎస్ ఆచార్య. ఆయనకు మంచి సహచరులు చాలా మిత్రులు ఉన్నారు. వారిలో పాత్రికేయుల సంఘ నాయకులు ఉన్నాయి. జీవస్ వరదాచార్యులు, బి నాగేశ్వరరావు, సి రాఘవాచార్యులు వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ నిర్మాణాన్ని నిర్మించిన వారిలో వరంగల్లు నుంచి కీలకమైన వ్యక్తిగా ఎం ఎస్ ఆచార్య. రాఘవాచార్యులు నాగేశ్వరరావు ప్రస్తుతం కీర్తిశేషులు. వారిలో మరింత ప్రముఖుడు, భీష్మదంతటి వరదాచార్యులు. ఆయన పత్రికారంగంలో తెలియని వ్యక్తులు లేరు. చాలా కాలం ఈనాడు పత్రికలో కీలకమైన రచనా ప్రముఖుడిగా ఉన్నవాడు వరదాచార్యులు.

1932, అక్టోబరు 24 న నిజామాబాదు జిల్లాలోని ఆర్మూరులో జన్మించాడు. నిజాం పాలనలో బాల్యమంతా గడిపిన వరదాచారి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డిగ్రీ, పి.జి. డిప్లమా ఇన్ జర్నలిజం చదివాడు. వరదాచారి జీవితం గురించి తేదీలద్వారా తెలియడం సాధ్యం కాదు. ఆయన సంపాదకీయాలలో, పదాలలో, పేజీల్లో, తొలి పేజీలో అక్షరాల్లో వార్తలు జీవించాయి.

మరణించేదాకా పాత్రికేయుడిదే ఊపిరి. సీనియర్ తెలుగు భాషా సినీ విమర్శకుడు, లక్షలకు లెక్కించిన వార్తా రచనలు చేసిన వాడు. 1988లో పదవీ విరమణ చేసేవరకు ఆంధ్రభూమి పత్రికకు సహ సంపాదకుడిగా ఉన్నారు. వరదాచారి 1932, అక్టోబరు 24న తరువాత కొంతకాలం 'ది హిందూ' పత్రికలో ఇంటర్న్‌షిప్ చేశాడు.

'కృష్ణా పత్రిక'ను తొలిసారిగా చదివిన వరదాచారి ఆ పత్రికకు పాఠకుడయ్యాడు. 1948లో ఆంధ్ర జనత పత్రికతో తన జర్నలిజం వృత్తిని ప్రారంభించాడు. జర్నలిజం డిగ్రీతో ప్రవేశించిన అతికొద్ది మంది జర్నలిస్టులలో వరదాచారి ఒకడు. నాన్ ముల్కీ సంఘటనలు, ఆంధ్రప్రదేశ్ అవతరణ తరువాత జరిగిన చరిత్రకు ప్రత్యక్ష సాక్షిగా ఉన్న వరదాచారి రాసిన సంపాదక లేఖగా పంపిన 'స్వతంత్ర' అనే రచనను పత్రిక వ్యాసం రూపంలో ప్రచురించింది. అదే ఇతని తొలివ్యాసం. ఆంధ్రభూమి, ఈనాడు పత్రికల్లో జర్నలిస్టుగా పనిచేశాడు. తెలుగు భాషోద్యమ సమాఖ్య ఉపాధ్యక్షుడిగా ప్రభుత్వంలో తెలుగు భాష వినియోగం కోసం పోరాడాడు. తెలుగు విశ్వవిద్యాలయంలో జర్నలిజం విద్యార్థులకు పాఠాలు బోధించాడు. పాత్రికేయరంగంలో తెలుగు విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ అందుకున్నాడు.

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ప్రధాన కార్యదర్శి 1964–1966. తరువాత 1980–1981 అధ్యక్షుడు. అంతకు ముందు ఆంధ్ర భూమి పత్రికకు 4 మార్చి 1961 – 20 నవంబరు 1982 గా పనిచేసారు. ఆ తరువాత 21 నవంబరు 1983 – 26 డిసెంబరు 1988 ఈనాడు అసిస్టెంట్ ఎడిటర్ పనిచేసారు. ఆంధ్ర జనత 26 జూన్ 1956 – 3 మార్చి 1961వరకు పనిచేశారు. తెలుగు విశ్వవిద్యాలయం 23 డిసెంబర్ 1988 నుంచి జర్నలిజంలో విజిటింగ్ ప్రొఫెసర్. కాని కూర్చిన పేజీలో చదివించే శక్తిని పేర్చిన వీరుడు వరదాచారి.

ఇవి కొన్ని బిరుదులు: 1. పత్రాకర్ శిరోమణి బిరుదు (మొట్టమొదటి హిందీ పత్రిక ఉదంత మార్తాండ్ 150వ వార్షికోత్సవం సందర్భంగా 1976, నవంబరు 26న కోల్‌కతాలో జరిగిన సర్వ భాష పత్రకర్ సమ్మేళనంలో), 2. దాసరి గోల్డ్ మెడల్ ఉత్తమ ఫిల్మ్ జర్నలిస్ట్ (1986), 3. పత్రికా రచనాచార్య బిరుదు (అక్టోబర్ 24, 1992న షష్టిపూర్తి కార్యక్రమంలో కిన్నెర సంస్థ), 4. తెలుగు విశ్వవిద్యాలయం జర్నలిజంలో ప్రతిభా పురస్కారం (1999), 5. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఉత్తమ జర్నలిస్ట్‌గా విఆర్ నార్ల జీవన సాఫల్య పురస్కారం 2005, 6 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఉగాది పురస్కారం (2006), 7 తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ విశ్వవిద్యాలయం (26 ఫిబ్రవరి 2007).

వరదాచారికి జర్నలిస్టుకు వృత్తి పట్ల నిబద్ధత, సత్యనిష్ఠ, సమగ్ర విషయ పరిజ్ఞానం, భాష మీద పట్టు ముఖ్యమైన యోగ్యతలు ఉన్నాయి. అవి పుష్కలంగా ఉన్నాయమని పెద్దలు చెప్పారు. సుదీర్ఘ కాలం పాత్రికేయంలో నిపుణులై పోయారు. పత్రికలలో ఏ విధంగా రచించాలో నేర్పడంలో నేర్పరి. పాఠాలు చెప్పగలరు. బాల్యంలో తండ్రి చెప్పిన, చెప్పించిన చదువు చెప్పగలిగారు. గొప్ప సంస్కారం కలిగిన వాడు. తనకున్న జ్ఞానాన్ని ఇతరులతో పంచుకోనేవారు. ఆయనకు పత్రికారంగంలో రచయితలను తయారు చేసిన గొప్పవాడు వరదాచారి. కష్టాలను గెలిచి, గంటల కాలం పనుల్లో ఉండేవారు. పదవీ వదిలేసిన తరువాత పాఠాలు నేర్పే కార్యభారాన్ని కూడా గొప్పగా నిర్వహించేవారు.



**–ఆచార్య మాడభూషి శ్రీధర్**

భాష ఏదైనా జర్నలిజంలో జీవిత కాలం పనిచేసి లబ్ధప్రతిష్ఠులైన జర్నలిస్టుల జీవిత చరిత్రలు మరితర రంగాల గొప్ప వ్యక్తుల కొన్ని జీవిత చరిత్రల వలనే ఎంతో విలువైనవి. పాఠకులకు ఆసక్తి కలిగించి, చదివించి, లోకరీతి, జీవిత విలువల అవగాహనను పెంచుతాయి. 'వరదాచారి జ్ఞాపకాలు' ఇలా వచ్చిన ఒక కొత్త గ్రంథం.



మే 14 2017న సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో 'జ్ఞాపకాల వరద' ఆవిష్కరణ దృశ్యం.

## ఆదర్శ పాత్రికేయ జీవితం

డా.జి.ఎస్.వరదాచారి దీర్ఘకాలం పత్రికలలో పనిచేయడమే కాదు, జీవితాన్ని జర్నలిజానికి అంకితం చేసిన పత్రికా రచయిత. 20వ శతాబ్ది ఆరవ దశకం నుంచి పత్రికా రంగంలో ఉన్న గొప్ప జర్నలిస్టులలో ఆయన ఒకరు. జర్నలిస్టుల కీర్తి, ఉన్నతి వారు చేసే ఉద్యోగాలను బట్టి మాత్రమే ఉండవు. ఉద్యోగ పదవులు కీర్తి కలిగించవని కాదు. కాని, వాటితో నిమిత్తం లేకుండా జర్నలిస్టుకు అతడి రచనలు కీర్తి కలిగిస్తాయి. జర్నలిజం రాజకీయాల వంటి రంగం కాదు. పత్రికా రచయితల ప్రతిభను ఎవరూ అడ్డుకోలేరు. సమర్థుడు ఏ పత్రికలో అయినా రాణిస్తాడు. పాఠకుల ఆదరాన్నీ, సాటి పత్రికా రచయితల నుంచి గౌరవాన్నీ పొందుతాడు. వరదాచారి కీర్తి అతడు పని చేసిన ఏ ఒక పత్రికకో పరిమితమై లేదు. ఎక్కడ తెలుగు భాష ఉంటే అక్కడెల్లా ఆయనకు జర్నలిస్టుగా గుర్తింపు ఉంది. ఆ విధంగా వరదాచారి తెలుగునాట సుప్రసిద్ధ జర్నలిస్టులలో ఒకరు. ఎనభై నాలుగు సంవత్సరాల పరిణత వయస్సులో ఆయన స్వీయ చరిత్ర రాశారు. 'జ్ఞాపకాలు' అని పేరు పెట్టారు. పేరు ఏమి పెట్టితేనేమి అది ఆత్మకథే. తెలుగువారిలో గొప్ప జర్నలిస్టులు గణనీయంగా ఉన్నా స్వీయ చరిత్రలు రాసిన వారు తక్కువే. అందులోనూ ఇంగ్లీషు జర్నలిజంలో రాణించిన జర్నలిస్టుల స్వీయచరిత్రలే ఎక్కువ. ఇంగ్లీషులో రాశారు కనుక జాతీయ స్థాయిలో అవి ప్రాచుర్యం పొందాయి. వరదాచారి ఆత్మకథ తెలుగులో స్వీయ చరిత్ర సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నది.

వరదాచారి తన రచన ప్రారంభిస్తూనే తనది 'అతి సామాన్యమైన జీవితం, గొప్పగా చెప్పుకోడానికి ఏమీ లేదు' అని రాశారు. అది ఆయన వినయం. తన బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు ఆయన జీవితంలో కొత్త తరాలు తెలుసుకోవలసిన, ముఖ్యంగా జర్నలిస్టులకు ఉపయోగపడే విశేషాలు చాలా ఉన్నాయి. పత్రికా రచనలోనేగాక ఆయన జీవితానికి ఒక విశిష్టతను కలిగించే కొన్ని ఘట్టాలు, సాధించిన విజయాలు ఉన్నాయి. వాటిని ఆయన గ్రంథం సంక్షిప్తంగా తెలియజేస్తున్నది.

వరదాచారి పుస్తకం ప్రథమాధ్యాయాలలో తన చిన్ననాటి ముచ్చట్లు, వివాహం మొదలైన విశేషాలు రాశారు. వాటిని 'అంతేకదా' అనుకోడానికి వీలులేదు. అలనాటి సాంఘిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను గురించి ఆయన చిత్రించినంత నిజాయితీగా సమకాలీన జీవిత చరిత్రలలో, నాకు తెలిసినంతవరకు, మరెవరూ రాయలేదు. కుటుంబ జీవితంలోను ఇతరులు తెలుసుకొని నేర్చుకొనవలసిన విశేషాలు ఉన్నాయి. తల్లిదండ్రులు, అన్నదమ్ములు, కుటుంబంలో ఇతరులపట్ల వ్యక్తికి ఉండే బాధ్యతలను అవి తెలియజేస్తాయి. ఆదాయం తక్కువైనా ఉన్నంతలో తృప్తిగా జీవితం గడపటం, నలుగురి చేత మంచి అనిపించుకోవటం ఆయన జీవితంలో చూడవలసిన ముఖ్య పార్శ్వం. వరదాచారి 22 సంవత్సరాలు ఆంధ్రభూమికి సేవలు అందించటం ఆయన జీవితంలో ఒక గొప్ప అధ్యాయం. న్యూస్ ఎడిటర్‌గానే ఉద్యోగం చేస్తేనేమి, చాలాకాలం 'ఆయనే ఆంధ్రభూమి, ఆంధ్రభూమే ఆయన' అనే పేరు ఉండేది. అక్కడే ఆయన ఎడిటరై ఉండవలసింది, కాలేదు. యాజమాన్యాలు ఎడిటర్లను నియమించేటప్పుడు అనేక కోణాల నుంచి పరిశీలన చేస్తాయి. ఎడిటరు కానందువల్ల ఆయనకు అక్కడ అంతకంటె తక్కువ గౌరవం ఎప్పుడూ కలగలేదు. ఇతర పత్రికా సంపాదకులకు వచ్చి, ఆయనకు రాని గొప్ప అవార్డులు ఏమీ లేవు.

జర్నలిస్టుకు వృత్తి పట్ల నిబద్ధత, సత్యనిష్ఠ, సమగ్ర విషయ పరిజ్ఞానం, భాష మీద పట్టు ముఖ్యమైన యోగ్యతలు. అవి వరదాచారికి పుష్కలంగా ఉన్నాయి. సాధన వాటిని శిఖర స్థాయికి చేర్చింది. ఆయన జీవితారంభంలోనే ఎంచుకొన్న మార్గం జర్నలిజం. అదే ఆయన జీవితమైంది. ఏ సంస్థలో ఎలా పని చేసినదీ, ఏమి అనుభవాలైనవీ ఆయన రాశారు. ఇవిగాక ఆయన ప్రత్యేకతలు కొన్నింటిని 'జ్ఞాపకాలు' గ్రంథం తెలియజేస్తున్నది.

> "జ్ఞాపకాల వరద'లో కుటుంబ జీవితంలోను ఇతరులు తెలుసుకొని నేర్చుకొనవలసిన విశేషాలు ఉన్నాయి. తల్లిదండ్రులు, అన్నదమ్ములు, కుటుంబంలో ఇతరులపట్ల వ్యక్తికి ఉండే బాధ్యతలను అవి తెలియజేస్తాయి. ఆదాయం తక్కువైనా ఉన్నంతలో తృప్తిగా జీవితం గడపటం, నలుగురి చేత మంచి అనిపించుకోవటం ఆయన జీవితంలో చూడవలసిన ముఖ్య పార్శ్వం"

వరదాచారి ఏ పత్రికలో పని చేసినా యాజమాన్యాల నుంచి కంటె సాటి ఉద్యోగస్తుల నుంచి, ముఖ్యంగా సంపాదక విభాగం సిబ్బంది నుండి ఎక్కువ గౌరవాన్ని, అభిమానాన్ని పొందారు. కారణం ఏమిటంటే ఆయన తన సహచరులను ప్రేమగా చూసేవారు. వారి శ్రేయస్సు చూడటం ఆయనకు 'సహజ ధర్మం'గా తోచేది. జర్నలిస్టుగా ఆయన రాసుకొన్న అనుభవాలను చదివితే ఎవరికైనా అదే అనిపిస్తుంది. సహచరులకు సాయపడటం ఆయన జీవిత ప్రత్యేకతలలో ఒకటి.


బాల్యంలో తండ్రి చెప్పిన, చెప్పించిన చదువు ఆయనలో గొప్ప సంస్కారాన్ని కలిగించింది. తనకున్న జ్ఞానాన్ని ఇతరులతో పంచుకోవటం కూడా ఆయనకు సహజ విధానమే అనిపిస్తుంది. ఎవరికైనా ఏదైనా తెలియనిది చెప్పటంలో ఆయనకు గొప్ప సంతృప్తి ఉంది. అది అధ్యాపక లక్షణం. మరి, ఆయన ఉపాధ్యాయ వృత్తిని ఎందుకు ఎంచుకోలేదు? ఆయనే తన గ్రంథంలో ఇలా చెప్పారు. 'ఉపాధ్యాయ వృత్తి, పత్రికా రచనా వ్యాసం – రెండూ సమాజాన్ని సర్వశ్రేయో మార్గం దిశగా నడుపుతాయని నమ్మకం. రెంటిలో జర్నలిజానికే కొంత పైచేయి. కనుక జర్నలిజం వైపే మొగ్గాను.' పత్రికలలో పని చేయటం మానేసిన తరువాత ఆయన శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగంలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పని చేశారు. విధి ఆయన సహజ అధ్యాపక లక్షణాన్ని ఆ పదవికి చేర్చింది.

వరదాచారి ప్రత్యేక యోగ్యతలలో మరొకటి ఆయన తెలుగు భాషాభిమానం, భాషాభినివేశం. చిన్నప్పటి నుంచి తెలుగంటే ఇష్టం. ఆయన కావాలనుకొంటే ఇంగ్లీషు జర్నలిజంలోకి వెళ్లి ఉండవచ్చు. కాని తెలుగునే ఎంచుకున్నారు. 'వరదాచారి జ్ఞాపకాలు' పుస్తకం చదివితే ఆయన భాషాభిమానం తెలుస్తుంది. అందుకే అది ఇటీవల వచ్చిన చాలా మంచి తెలుగు రచనలలో ఒకటి అనిపించుకొంటుంది. ఎంతోమంది విని ఉండని చక్కని తెలుగు పదాలు ఈ గ్రంథంలో కనిపిస్తాయి. 'తంతె' (మెట్టు), 'తనియ' 'మణియారీ' 'దిలాసా' లాంటి అందమైన పదాలు గ్రంథంలో వాక్యాల సౌరభాన్ని పెంచాయి. తన సహచరులకు చెప్పినట్లే ఈ పుస్తకంలోనూ కొన్ని పదాలను ఆయన పాఠాలుగా చెప్పటం మరొక విశేషం.

నిజాన్ని నిర్భయంగా చెప్పటం జర్నలిజంలో ఒక మౌలిక సూత్రం. వరదాచారి ఈ గ్రంథ రచనలోనూ అది పాటించారు. ఎవరికి కోపం వస్తుందో అని సంకోచించకుండా ఆయన ఒకప్పుడు తెలంగాణలో జరిగిన రజాకార్ల దుష్కృత్యాలను తెలియజేశారు. ఎవరైనా తప్పుచేస్తే, రాస్తే మర్యాదకు భంగం రాకుండా సరిచేయటం కూడా ఆయన పద్ధతులలో ఒకటి. ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకు వెళ్లినపుడు తనను ప్రశ్నలు వేసిన పెద్దలలో ఒకరిని తప్పు పట్టడానికి వెనుకాడలేదు. 'ఉద్యోగం ఎలాగూ రాదని తెలుసు కనుక అంత నిర్మొహమాటంగా మాట్లాడాననుకొంటున్నారు కదూ? సరికాదు. ఎవరు తప్పు చేసినా దాన్ని మర్యాద తప్పకుండా సరిదిద్దటం నా స్వభావం. ఉద్యోగంపై ఆశ ఉన్నా అలాగే చేసేవాణ్ణి' అన్నారాయన. వరదాచారి రాసిన ఒక పుస్తకం పేరే 'దిద్దుబాటు'.

డాక్టర్ వరదాచారి వైయక్తిక జీవితమూ, పాత్రికేయ జీవితమూ రెండూ ఆదర్శప్రాయంగానే గడిచాయి. స్వభావరీత్యా సాటి ఉద్యోగులకు సహాయం చేయటం మొదటి నుంచీ ఉన్నది కనుక ఆయనకు ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ సంస్థతో దాదాపు దాని ఆరంభం నుంచి సంబంధాలు ఉండేవి. కొన్నాళ్లకు ఆయన దానికి అధ్యక్షుడైనాడు. కష్టాల్లో ఉన్న వర్కింగ్ జర్నలిస్టులకు యూనియన్ అండగా ఉండేది. అలాగే ఆయనే స్థాపించిన ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ కూడా మంచి పేరు సంపాదించుకొన్నది.

జీవితంలో ఆయనకు ఇలా ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి, ఆయన స్వయంగా రాసుకొన్న 'జ్ఞాపకాలు' అన్నింటిని కాకపోయినా కొన్నింటిని పాఠకుల ముందు ఆవిష్కరిస్తున్నది. ఈ గ్రంథంలో మరొక ప్రత్యేకత ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా కానీ ఆయన ఎవరి మీద నిందలు వేయలేదు. విమర్శలు చేయలేదు. నిర్మాణాత్మక సూచనలూ, గుణాత్మక వ్యాఖ్యలే కనిపిస్తాయి. కొత్త తరం పత్రికా రచయితలు చదివి తీరవలసిన ఒక అగ్రశ్రేణి పత్రికా రచయిత జీవిత చరిత్ర ఇది.



**–పొత్తూరి వెంకటేశ్వరరావు**

## పత్రికాలోకానికి పితామహుడు జీఎస్ వరదాచారి

గోవర్ధనం సుందర వరదాచారి పత్రికారంగంలో పితామహుడిలాంటివారు. మా కంటే ముందు తరం వారిది. వరదాచారి మొదటి సంపాదకుడు అయిన కూచిమంచి సత్యసుబ్రహ్మణ్యం నాకూ తొలి సంపాదకులే. వరదాచారి గురించి అభినందన పూర్వకంగా సుబ్రహ్మణ్యం చెప్పేవారు. మంచి జర్నలిస్టు, భాషపైన పట్టున్నవాడు, విషయపరిజ్ఞానం సంపూర్ణంగా ఉన్నవాడు అని.

సత్యసుబ్రహ్మణ్యం 'ఆంధ్రజనత' దినపత్రికకు సంపాదకుడుగా ఉన్న రోజుల్లోనే వరదాచారి ఆ పత్రికలో ఉపసంపాదకుడుగా 1956లో చేరి తన పాత్రికేయ జీవితానికి శ్రీకారం చుట్టారు. ఆయన తర్వాత అజంతా, పొత్తూరి వెంకటేశ్వరరావు, బుద్ధవరపు విశ్వేశ్వరరావు, తదితరులు చేరారు. అక్కడ అయిదేళ్ళు పని చేసిన తర్వాత 'ఆంధ్రభూమి'లో చేరారు. రెండు దశాబ్దాలపాటు న్యూస్ ఎడిటర్ గా ఉన్నారు. న్యూస్ ఎడిటర్ అని పేరే కానీ మొత్తం పత్రిక నిర్మాణం యావత్తూ ఆయనే చూసుకునేవారు. సంపాదకులు గోరాశాస్త్రికి ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ సంపాదకీయాలు రాయడంతో సరిపోయేది. ఆ తర్వాత 'ఈనాడు'లో అసిస్టెంట్ ఎడిటర్ గా చేరారు. అయిదేళ్ళ తర్వాత 1988లో పత్రికారంగంలో ప్రత్యక్ష సేవకు విరామం ప్రకటించి జర్నలిజం అధ్యాపకుడుగా కొత్త అవతారం ఎత్తారు. పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయంలో జర్నలిజం విభాగాన్ని ప్రారంభించే బాధ్యతను ఘనంగా నిర్వర్తించారు. దాదాపు రెండు దశాబ్దాలుగా జర్నలిజం బోధించి ఉద్యోగవిరమణ చేశారు. తెలుగు విశ్వవిద్యాలయం ఆయన సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ తో సత్కరించింది. 2010లో హెచ్ఎంటీవీలో తొలి తీర్పరి (అంబుడ్స్ మన్) గా చేరారు. 2014 వరకూ, నేను ఆ చానల్ కు చీఫ్ ఎడిటర్ గా ఉన్నంతవరకూ, ఆ పదవిలో ఉన్నారు. తర్వాత వయోధిక పాత్రికేయ సంఘం బాధ్యతలు నిర్వహించారు.

'ఆంధ్రభూమి'లో న్యూస్ ఎడిటర్ గా పని చేస్తూనే సినిమా రంగం అధ్యయనం చేసేవారు. సినిమా సమీక్షలు చేసేవారు. సినిమా క్రిటిక్స్ అసోసియేషన్ కు ఉపాధ్యక్షుడుగా చాలాకాలం పని చేశారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ వ్యవస్థాపక సభ్యులుగా ఉన్నారు. ఖైరతాబాద్ లో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి దోహదం చేసిన జర్నలిస్టులలో వరదాచారి ఒకరు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు అధ్యక్షుడుగా పని చేశారు. జర్నలిస్టుల ఉద్యమంలో చురుకుగా ఉండేవారు.

ప్రెస్అకాడెమీ వారు నిర్వహించే శిక్షణాతరగతులలో 'ప్రెస్ లా' వరదాచారి, రాఘవాచారి చెప్పేవారు. సారస్వత సభలలో అనర్గళంగా మాట్లాడేవారు. తెలుగుభాషపైన మమకారం, అధికారం ఉన్న పాత్రికేయుడు. తాను పని చేసే పత్రికల లోనూ, ఇతర తెలుగు దినపత్రికలలోనూ వస్తున్న భాషాదోషాలను ఎంచి యువజర్నలిస్టులను మంద లిస్తున్నట్టుగా 'ఇలాగేనా రాయడం?' అంటూ ఒక పుస్తకం రాశారు. పొరబాట్లను ఎలా దిద్దుకోవాలో చెబుతూ 'దిద్దుబాటు' అనే ఉపయుక్తమైన గ్రంథం రచించారు. 'మన పాత్రికేయ వెలుగులు' అనే పేరుతో వరిష్ఠ పాత్రికేయుల గురించి పుస్తరం రాశారు. ఆత్మకథ రాశారు. పత్రికలలోనే కాకుండా ఎలక్ట్రానిక్ మీడియంలో కూడా తప్పొప్పులు దిద్దేబాధ్యత తీసుకున్నారు.

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ లో 15 అక్టోబర్ 1932లో జన్మించిన వరదాచారి ఉస్మానియాలో చదివారు. ఎంఏ చదివి, ఎల్ఎల్ బీ చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం జర్నలిజం డిపార్ట్ మెంట్ ప్రారంభ దశలో జర్నలిజం డిప్లొమా చేశారు. ఆయన జర్నలిజం చదివినప్పుడు గోవిందరాజులు అని హెడ్ ఆఫ్ ది డిపార్ట్ మెంట్ ఉండేవారు. అప్పుడు డిప్లొమానే ఉంది. ఆ తర్వాత మేము చదువుకున్న 1973 నాటికి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ వచ్చింది. బషీరుద్దీన్ శాఖాధిపతిగా వచ్చారు. ఆ తర్వాత ఎంఏ వచ్చింది. ఇప్పుడు పిహెచ్ డిలు కూడా చేస్తున్నారు.

నేను హెచ్ఎంటీవీలో పని చేసే రోజుల్లో ఆయన ఇంటికి వెళ్ళి అంబుడ్స్ మన్ గా పని చేయాలని అభ్యర్థించాను. ఆయన అంగీకరించారు. అంబుడ్స్ మన్ అని ఇంగ్లీషు మాటతో పిలిస్తే బాగుండదని ఇద్దరం చర్చించుకొని 'తీర్పరి' అని పేరుపెట్టాం. ప్రతివారం ఒక రోజు సాయంత్రం స్టుడియోలో నేనూ, 'తీర్పరి' వరదాచారి కూర్చొనేవారం. ఆ వారంలో చానల్ లో జరిగిన తప్పులను ఎత్తి చూపడం, వీక్షకులు రాసిన లేఖలకు సమాధానాలు చెప్పడం, అప్పుడు అమలు లో ఉన్న ధోరణుల గురించి మాట్లాడటం, కొత్త కోణాలు ఆవిష్కరించేందుకు ప్రయత్నించడం చేసేవాళ్ళం. టైమ్స్ ఆఫ్ ఇండియా, ద హిందూ మినహా అంబుడ్స్ మన్ వ్యవస్థను ఎవ్వరూ పెట్టలేదు. తెలుగులోనే కాదు భారత ఎలక్ట్రానిక్ మీడియాలోనే తొలి అంబుడ్స్ మన్ వరదాచారి.



డిసెంబర్ 12 2013న త్యాగరాయ గానసభలో విశ్వసాహితీ ఆధ్వర్యంలో "తెలుగు జాతి భవిష్యత్తు?" సరస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ పాత్రికేయులు డా॥జి.యస్. వరదాచారిని సభాధ్యక్షుడు బైస దేవదాసు సన్మానిస్తున్న దృశ్యం. వేదికపై పోతుకూచి సాంబశివరావు, డా॥ కళావేంకట దీక్షితులు, డా॥ కేతవరపు రాజ్యశ్రీ.

ఆరడుగుల పైచిలుకు ఎత్తు, మంచి దేహదారుఢ్యం, కంచు కంఠం, సుబోధకంగా వివరిస్తూ అద్భుతంగా ఉపన్యాసాలు ఇవ్వగల నేర్పు, చక్కటి, చిక్కటి తెలుగు వచనం, నిష్పాక్షికమైన సినిమా సమీక్షలు రాయడంలో నిష్ణాతుడు వరదాచారి. నైతికంగానే కాకుండా భౌతికంగా కూడా తొంభై ఏళ్ళు వచ్చినప్పటికీ ఏ మాత్రం వంగకుండా నిటారుగా నిలబడేవారు. ఆచార్యులుగా వందలమంది జర్నలిస్టులను తయారు చేశారు. తెలుగు జర్నలిజానికి ఎనలేని సేవచేశారు. ముక్కుసూటిగా మాట్లాడే తత్త్వం. ఒకరిని ఆశ్రయించడం, కార్యం సాధించడం, పైరవీలు చేయడం, రాజకీయనాయకుల చుట్టూ తిరగడం వంటి అవలక్షణాలు బొత్తిగా లేని స్వచ్ఛమైన, పరిశుభ్రమైన మనిషి. ఎన్నో పదవులకు ఆయన అర్హుడే అయినప్పటికీ ఏ పదవీ రాకపోవడం విశేషం. లౌక్యం తెలియకపోలేదు కానీ దాన్నిపదవులు సాధించేందుకు ప్రయోగించడం ఆయనకు బొత్తిగా ఇష్టం ఉండేది కాదు. ఇద్దరు కుమారులూ, ఇద్దరు కుమార్తెలూ చదువుకొని పైకి వచ్చారు. కుమారులు హైదరాబాద్ లోనే ఉంటున్నారు. కుమార్తెలు ఇద్దరూ అమెరికాలో ఉంటున్నారు. అందరూ తమ జీవితాలలో ఎదుగుతున్నారు. జూబ్లీహిల్స్ లో మొదటి జర్నలిస్టు కాలనీలో ఇల్లు కట్టుకున్నారు. దుర్వ్యసనాలకు దూరంగా, అధ్యయనానికి దగ్గరగా, రచనావ్యాసంగంలో మమేకం అవుతూ, అధ్యాపకుడుగా రాణిస్తూ, సంతృప్తి చెందుతూ, విద్యార్థులను ప్రేమిస్తూ, వారిని భావిపాత్రికేయులుగా తయారు చేస్తూ హుందాగా, దర్జాగా, రాజీపడకుండా, ఎవరికీ తలవంచకుండా బతికారు. ఆయనది నిండు జీవితం.



**–కె రామచంద్రమూర్తి**

# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com

2 హైదరాబాద్ | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | గురువారం 10-11-2022


## బుద్ధ పర్వాలు

జాతియోద్యమ
పత్రికలు ఆనాడు
వ్యాపార జాతి
పుత్రికలు ఈనాడు.

ఎంకా! తొడమీద
అగ్గి వడ్డది తీయ్యిర
ముందు నా కాలు
ముల్లు పీకు దొరా!

ఆయిటి పూని
చినుకు పడిందా!
అప్పుడు చూడు
మన్ను కమ్మని వాసన!

భూమి తల్లిని
ముక్కలు ముక్కలుగా కోసి
అమ్ముకొనుడే
రియల్ ఎస్టేట్.

మానవ సంబంధాలపై
కీలకోపన్యాసం
ఇంట్ల
పిల్లికి బిచ్చం పెట్టడు.




– అన్నవరం దేవేందర్
9440763479

## ఘంటారావం

ఎవరి లోకం
వారిదే
ఎవరి శోకం
వారిదే.

మోసం చేసి
మీసం మెలేయకు
మహా సంగ్రామానికి మూలం
మాయా జూదమని మరువకు.

ఆందోళనకు మూలం
అధైర్యం
అనర్థానికి మూలం
అపార్థం.



–గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

## ఆమె...!

పూవులో పూసిన పుప్పొడి
చినుకులో తడిసిన చిత్తడి
పలుకులో పల్లవించిన సవ్వడి
అందంలో అరవిరిసిన సింగిడి
ఆమె.... వెన్నెల పసిడి.

అవనిలో పూసిన మందారం
నడకలో నాట్యమయూరం
నవ్వులో విరిసిన వయ్యారం
చూపులో మెరిసిన సింగారం
ఆమె....తనువంతా బంగారం.

కళ్ళల్లో మెరిసే ప్రేమకిరణం
కలల్లో కురిసే సుమగంధం
అక్షరాల్లో ఎగిసే కెరటం
ఆశల్లో ముంచేసే మధుపం
ఆమె.... రాయని కావ్యం.

కవితల్లో కమ్మని కల్పన
ఊహల్లో చక్కని వర్ణన
జ్ఞాపకాల్లో చిక్కని భావన
చూపుల్లో ఏకాంత చింతన
ఆమె.... ప్రేమాలాపన.

మాట మధురాతిమధురం
పలుకు సుమనోహర గీతం
చూపు నయన మనోహరం
చెక్కిలి మనోరంజనం
ఆమె.... స్నేహపరిమళం



– డా. భీంపల్లి శ్రీకాంత్
9032844017

## ఇక వెలుగులు ఖాయం

ఆశ నిరాశల మధ్య
సరికొత్త నిర్వచనం
జనం జెండాగా మారటం.

ఇప్పుడు జనం
జెండాగా ఎగురుతున్నారు
సంక్షోభం ముంచుకొచ్చిన సమయాన
సాగరం ఎగిరి ఎగిరి పడుతుంది
సాగరానికి ఎప్పటికీ ఓటమి లేదు
ఒడ్డున కొట్టుకున్నా
మళ్లీ లేచి ఎగురుతుంది.

కెరటం జన హృదయం ఒకటే
సాగరం ఎప్పుడూ
ప్రశాంతంగా కనిపించినా
ఆగ్రహం సూర్యోదయం అయినప్పుడు
చీకట్లు పారిపోక తప్పదు.

ఎంతకాలం చీకట్లో ఉంటాం చెప్పు
అమావాస్యలు ఎన్నో అనుభవించాం
జనం తమ కన్నుల మీద
జీవితమంతా చీకటి మోశారు
ఇప్పుడు
జనం కనురెప్పలు జెండాలయ్యాయి
ఇక
వెలుగులు ఖాయం



–సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

## సహాయం చేస్తే తిరిగి వస్తుంది (కథ)

పూర్వం ఒక వ్యాపారి దగ్గర ఒక గుర్రం ఉండేది. అతని వ్యాపారానికి కావలసిన సరుకులు పొరుగూరికి వెళ్లి తెచ్చుకునేవాడు. గుర్రం వీపు మీద తక్కువ బరువులు వేసేవాడు. అదే గాడిద వీపు మీద మాత్రం చాలా ఎక్కువ బరువులు వేసేవాడు. పాపం గాడిద మారు మాట్లాడకుండా ఎంత బరువైనా మోసేది బాగా అలసిపోయేది. గుర్రం వీపు మీద తక్కువ బరువు ఉండటం మూలంగా చకచకా నడుచుకుంటూ వెళ్ళేది మరియు చాలా ఉత్సాహంగా ఉండేది.

ఒక రోజు గాడిదకు జ్వరం వచ్చింది నీరసంగా ఉన్నది కళ్లు తిరుగుతున్నాయి. అప్పుడు గుర్రాన్ని ఇలా అడిగింది – " ప్రియనేస్తమా, ఈ రోజు నా ఆరోగ్యం బాగాలేదు. దయచేసి ఈ రోజు నా బరువులు నీవు మోసుకోస్తావా ".

'గాడిదకు సహాయం చేస్తే నాకేమొస్తుంది. నాకైతే యజమాని తక్కువ బరువులే ఇస్తున్నాడు. నేను హాయిగా ఉన్నాను గాడిద సంగతి నాకెందుకు' అని మనసులో ఆలోచించుకుంది గుర్రం. సారీ, గాడిదా! యజమాని నీకిచ్చిన బరువును నువ్వే మోయాలి. నేను సహాయం చెయ్యలేను' అన్నది గుర్రం నిర్మొహమాటంగా.

గాడిద నిస్సహాయంగా నడుస్తూనే ఉన్నది. దానికి ఆయాసం వచ్చింది. అయినా గుర్రం పట్టించుకోలేదు. అలాగే ఇంకో రెండు మైళ్ళ దూరం నడిచింది.

అకస్మాత్తుగా గాడిద కింద పడిపోయి ప్రాణాలు విడిచింది.

అప్పుడు వ్యాపారి గాడిద మీదున్న బరువులన్నీ తీసి గుర్రం మీద వేశాడు. గుర్రం గుండె గుభేలు మంది. అంతే కాక చచ్చిపోయిన గాడిద శరీరాన్ని కూడా గుర్రం వీపుకే కట్టాడు. గుర్రం నడుం విరిగి పోయినట్లుగా అనిపించింది.

గుర్రం బరువులు మోయలెక ఏడ్చింది. ఇందాక గాడిదకు సహాయం చేసి ఉంటే బావుండే దనుకున్నది. ఇక ప్రతిరోజూ గాడిద పని కూడా తనే చేయాలి. ఎంత తప్పు చేశాను అని బాధ పడింది. నా స్వార్థం నాకు నష్టం కలుగజేసింది అని గుర్రం వగచింది.


నీతి:– ఎవరికైనా సహాయం అవసరమైనపుడు స్వార్థాన్ని వీడి సహాయం చేయండి. పరులకు చేసిన సాయం మీకూ ఉపయోగపడుతుంది.



–డా॥కందేపి రాణీప్రసాద్
98661 60378

# ఒక జీవిత కాలపు సమాచార దర్శిని






కరోనా కష్టకాలంలో ప్రపంచం యావత్తూ వణికి పోయింది. వేగంగా వ్యాపించటం, నివారిణోపాయం అప్పటికి ఇంకా కనుగొనబడక పోవటం, కార్యకలాపాలు యావత్తు స్తంభించటం వల్ల విశ్వవ్యాప్తంగా జనం భయభ్రాంతులకు లోనయ్యింది. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో అంతర్జాలం (internet) పోషించిన పాత్రను ఎన్నినోళ్ళ కొనియాడినా తక్కువే అనిపిస్తుంది. బయటకు కదలలేని ప్రజానీకాన్ని ఉల్లాసవర చగల వ్యాపకం అంతర్జాలంలోని వాట్సప్‌లు ముఖ పుస్తకాలు కలిగించాయి.

కరోనా సెకండ్‌వేవ్ రోజుల్లో 2021 మార్చి నెలలో సాహితీవేత్త సుధామగారి మానస పుత్రిక తెలుగు ప్రపంచానికి 'ఒకసారి చూడండి.. అంతే!" వాట్సప్ గ్రూప్‌గా పరిచయం అయింది. కరోనా అన్నపదమే కనబడని, వినబడని నిబద్ధతతో, కథలు, కవితలు, పాటలు, కార్టూన్లు, రేడియో నాటికలు– ఒక్కటనేమిటి– వినోద ప్రపంచాన్నంతా సభ్యులకు పంచింది. సామాజిక మాధ్యమాల్లోనే ఈ వినూత్న ప్రయోగానికి ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ప్రజలందరి నుండి అనూహ్యమైన స్పందన లభించింది. ఒక రేడియో ఒక పత్రిక, ఒక దూరదర్శన్‌గా దృశ్య, శ్రవణ, పఠన ప్రసార సంచికగా సుమారు రెండువేల మంది సభ్యుల ఆదరణకు నోచుకుంది. ఈ సమూహం ఎందరో ప్రముఖ కథకులు, కవులు రచయితలు పలు కళా సాంస్కృతిక రంగాలకు చెందిన నిష్ణాతులు ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొంటున్నారు. ప్రముఖ కథా నవలా రచయిత శ్రీ సి.ఎన్. నారాయణ, ప్రఖ్యాత కథా, నవలా, సినీ రచయిత శ్రీ మల్లాది వెంకట కృష్ణమూర్తి, సినీ సమీక్షకులు శ్రీ వేదుల ఎస్.ఎస్. మూర్తి, రేడియోవార్తల బాల భాస్కర్, శ్రీమతి వంజారి రోహిణి శ్రీ రాధాయి, ప్రహేళిక సృష్టికర్త శ్రీ కె.వి.ఆర్. సుబ్రహ్మణ్యం ప్రభుతులు హార్దికంగా,ఆర్థికంగా సహకరించేందుకు రావటం శ్రీ సుధామగారి బుద్ధికుశలతకు, ముందు చూపుకు నిపుణతకు నిదర్శనం.

మొదట్లో రోజు వారీగా సాగినా మొదటి, మూడు గురువారాలకు ప్రస్తుతం పరిమితమై, గుడ్ మార్నింగ్ గుడ్‌నైట్‌లాంటి విసుగు పుట్టించే సందేశాలకు ఏమాత్రమూ తావివ్వక, అనుక్షణం అంగుళం, అంగుళం శ్రీ సుధామగారి పర్యవేక్షణలో రసిక జనరంజకంగా సాగుతున్న ఈ గ్రూపులో కొందరు సభ్యుల సూచనతో దసరా 2022 ప్రసార సంచికలో కథలు, కవితల పోటీ నిర్వహించింది. పాల్గొన్నవారికి ఉత్సాహం కలిగించేందుకు బహుమతులు కూడా ప్రకటించబడ్డాయి. 60కి పైగా కథలు 10కిపైగా కవితలు పంపి 'ఓసారి చూడండి.. అంతే!" సభ్యులు తమ ఉత్సాహాన్ని కనబరిచారు.

పోటీకి వచ్చిన కథలను ప్రముఖ కవి, కథకులు మరియు సాహితీవేత్త శ్రీ విహారి (జె.యస్.మూర్తి) గారు పరిశీలించారు. బహుమతి పొందిన 5 కథలు కాకుండా మరో 25 కథలకు ఎంపికచేసి ప్రస్తుత కథా సంకలనం "కథా మాలిక' అన్న పేరుతో తెలుగు పాఠకులకు అందిస్తోన్న అపురూప దసరా–దీపావళి–2020 కానుక ఇది. బాపూ బొమ్మను తలపించేలా అందమైన అట్ట, సమర్పించిన సుధామగారి తొలిమాట, ఏర్చికూర్చిన విహారిగారి 'సమీకరణ' వ్యాసం సంకలనానికి అదనపు ఆకర్షణ.

శ్రీ విహారిగారు వివరించినట్లు ఈ కథల్లో వస్తు వైవిధ్యం, గుణ విశేషం, వర్తమాన సమాజానుశీలన ఉన్నాయి. ఇంతే కాదు, కథల్లో మానవ జీవితాలు ధ్వనిస్తాయి. ఒకటీ ఆరాకథలు తప్పించి జీవితం అంత నిడివితో కాకుండా జీవిత శకలాలు గోచరమవుతాయి.

ఏ నిబంధనలు నియమాల గిరిగీతల నడుమ నడవకుండా స్వేచ్ఛగా సాగిన కథల్లో భార్యాభర్తల మధ్యపైకి కనబర్చని ప్రేమ అనురాగం ఉంది. దాంపత్య జీవితంలో అదనపు ఆనందం పిల్లలు కలిగిస్తారని ప్రథమ బహుమతి పొందిన **'మౌనం పరిమళించిన వేళ'** కథ చెబుతుంది. అంతర్లీనంగా ప్రవహించే హాస్యం ఈ కథకు అదనపు ఆకర్షణ.

భారతీయ సంస్కృతిని దేశ దేశాలా చాటండి. జన్మకు మూలమైన దేశాన్ని మరువకండి.. మాతృదేశ ఘనతకు మీ విద్యను పరపతిని పంచి ఇచ్చి దేశభక్తిని మరింత పెంపొందించండి అన్న ఉదాత్త సందేశం రెండవ బహుమతి పొందిన **'చదువుల పండుగ'** వివరిస్తుంది.

బ్రతికి ఉన్నప్పుడే కాదు, చనిపోయిన తర్వాత కూడా సమాజానికి ఉపయోగకరమైన పనులతో జీవితాన్ని ధన్యం చేసుకోవాలని ప్రగాఢంగా విశ్వసించే ప్రసాద్ బ్రతికి ఉన్నపుడు అవయవ దానాన్ని ప్రోత్సహిస్తుంటాడు. చనిపోయిన వారి బంధువులు మొదట ఈసడించుకున్నా, వారికి బోధపరిచి అవయవదానం చేపిస్తుంటాడు.


కరోనా కాటుకు బలియై చివరకు ప్రసాద్ భౌతిక దేహం ఎవరికీ ఉపయోగపడకుండా ఖననం అవుతుంది. ఎవరు ఎక్కడ కలుస్తారో.. ఎలా విడిపోతారో.. ఎవరికీ తెలియదు. 'తీరని కోరిక'లా మిగిలిపోయిన ప్రసాద్ జీవితంలో విధి ఆడిన వింత నాటకం చదువుతోంటే పాఠకుడు కూడా కన్నీరు మున్నీరవుతాడు. వంట గ్యాసు. కరెంటు, నీళ్ళులాంటివి. జాతీయ సంపద. ఈ సంపదను వాడినందుకు ఏదో నామ మాత్రపు రుసుము కట్టినంత మాత్రాన్నే సరిపోదు. పొదుపుగా వాడుకోవాలి. దుబారా చేయ వద్దు అన్న గొప్ప సందేశాన్ని ఇస్తుంది. 'జాతి వనరులు' కథ. దేశసంపదను వృథా చేయవద్దని ఇప్పుడు వృథా చేస్తే ముందు కాలంలో ఇబ్బందులను ఎదుర్కొవలసి వస్తుందని చెప్పటం బావుంది. ప్రతీ పౌరుడు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని చెబుతుంది.

అవినీతి, లంచగొండితనం సమాజానికి పట్టిన చీడ, అందరూ అసహ్యించుకునేవారే. కాని బహిష్కరించిన వారు ఎవరు లేరు.

లంచం తీసు కోవటం కాలాను గుణంగా మారటం అని మభ్యపెట్టు కోవద్దు. మన వ్యక్తిత్వమే మన అస్తిత్వం అని **'దక్షిణ'** కథ చెబుతుంది.

స్థాలీపులాక న్యాయంగా ఉదహ రించినపై కథలే కావు. సంకలనం లోని కథలన్నీ **'జీవిత కాలపు సమాచారదర్శిని'**గా భాసించే కథలు. మంచి సందేశాల్ని సమాజానికి ఇచ్చే కథలు.


**ప్రతులకు:** సుధామ
ఎ.వెంకటరావు,
ఈ–107
రాజపుష్ప అట్రియా,
గోల్డెన్
మైల్‌రోడ్, కోకాపేట,
హైదరాబాద్
–500 075



– కూర చిదంబరం
సెల్: 8639338675

## అనాది బంధం

మాది పల్లెటూరు
ఇంటికి ఆనుకునే ఐదెకరాల తోట
అది జామ తోట
రంగుల రంగురంగుల
రామచిలుకలకి నిలయమైంది
స్థావరమైంది
కోళ్ళు కొక్కొరకో తోనే
కాకులు కావు కావు తోనే
మేం నిద్ర లేవం
రామచిలుకల కిలకిలరావాల
కీర్తనలతోనే లేవడం
ఒక్కోసారి కోపం వచ్చినా
చాలా సార్లు ఆనందపడ్డాం సంబరపడ్డాం
తెలుగు భాష ఇంగ్లీషు భాష లాగా
అమ్మ పక్షి భాష వుంటుందా ?
నేర్చుకోవాలనేది మేం
సరదాగా ఇంటిల్లిపాది
తోటలోకి వెళ్ళగానే
మారాం చేసేవి గారాలు పోయేవి
హ్వాయలు హ్వాయలుగా సాగేవి
వరుసగా జారిపడే మేఘపు తునకలకి
మేమంతా రేకుల షెడ్డు వేసాం
కృతజ్ఞతలకి సాక్ష్యంగా
నాన్న భుజం చేరి
చక్కిలిగింతలు పెట్టాయి
తులాభారమైన శిబిని
గుర్తుకు తెచ్చుకున్నాయి



–కోటం
చంద్రశేఖర్
9492043348

## స్నేహ పుష్పాలు

మనసు ఇంటికి
స్నేహం ఎప్పుడు ఎలా వచ్చి
కాళ్ళు కడుక్కుంటుందో
కడుపుల తలపెడుతుందో
బంతి భోజనం చేస్తుందో
ఎవరూ చెప్పలేరు.

స్నేహం జతకట్టిందంటే
కులం, మతం,
ఆదాయం లెక్కల్లో ఉండవు
అలుముకున్న తీగ
కష్టసుఖాలలో అండాదండ.

స్నేహంలో మజా
అనుభవిస్తేనే
రంగు రుచి వాసనల ఆత్మీయత
కొలమానాలు,
ఉపమానాలేవీ సరితూగదు.

మాటల కలయికలు
మనసులు పంచుకుంటే స్నేహం
కలిసి చదువును ఇచ్చిపుచ్చుకోవడంలో
ఆటపాటలు అందిపుచ్చుకోవడంలో
హద్దులు దాటిన ప్రేమ
స్వార్థాన్ని వదిలించుకోవడం

స్నేహానికి చిరునామా
పాలు నీళ్ళ కలయికతో
నీళ్ళ విలువ పెరిగింది
పాల లెక్క మారింది
మంచి వాళ్ళతో సోపతి అంతే
రెండు వాయువుల స్నేహం
మంచినీరు
జీవులకు ప్రాణాధారం
ఆవిరై విడిపోతే అంతే
మట్టి చినుకుల స్నేహం.

సువాసనల మయం
ప్రకృతి పరవశం
సృజనకు సహకారం.

దుష్ట సహవాసం
కాలికంటిన బురద
వెంటనే కడుక్కోకపోతే
సోపతి తొవ్వ నాశనం.

నమ్మకానికి వెన్న పూసి
మోసం చెట్టుకు కట్టేసి కొడితే
ద్రోహపు జీడి మరకలు
జీవితాంతం కలతలు.

కవుల మధ్య స్నేహం పెరిగింది
కలుపు తొలగించుకున్నారు
కవిత్వానికి చప్పట్లు



–కొమురవెల్లి అంజయ్య
9848005676

## నేను ఒక జీవన వాక్యం

బ్రతుకు కష్టాన్ని వ్యాఖ్యానిస్తాను
ప్రతి కష్టం యొక్క నిష్టురాన్ని కళ్ళతో మనసుతో వీక్షిస్తున్నా

ఆశల లోగిలిలో అనుదినము సాగిపోతున్నాను
ప్రతి సంఘటన నా హృదయంలో కదిలించే కథల

బ్రతుకు ఒక నిర్మలత్వం విశాలత్వం పరిపూర్ణమైన
జీవన వాక్యాన్ని కోరుకుంటున్నాను

ప్రపంచంలోకి అడుగు పెట్టినప్పుడు మనిషి
పలు దిక్కుల ఒకసారి పరామర్శించాలి

వెన్నెల వేకువ వేసవి అన్నింటిని వీక్షించాలి
చలి వర్షం అన్నింటినీ అనుభూతించాలి.

వాతావరణం అనుకూలమైన
నిశ్చల జనరేటర్ నాకు కావాలి.

జన సమీకరణలో నేనొక అణువును మాత్రమే
జనం మనంగా మనం జనం గా .....
నిర్మల మందాకినీ తీరాల వైపు
అడుగులు ముందుకు వేయాలి....



–డాక్టర్ సిహెచ్ ఆంజనేయులు,
7702537453

పుస్తక సమీక్ష

# పులకరించిన పూలు

సర్వేంద్రియాలు టచ్ స్క్రీన్‌కి వేలాడదీస్తూ, ప్రక్కనున్న వాళ్ళ పలకరింపు కూడా గమనించలేని మైకంలోవున్న లోకంలో 'సుమ సోయగాలు'ని ఒడిసిపట్టి వాటిని ఆఘ్రాణించడానికి మనందరి ముందుంచిన పొత్తూరి సుబ్బారావుగారు కవిగా, పర్యావరణ మిత్రులుగా అభినందనీయులు. నిజానికి తెలుగునాట సినీగీతాల్లో తప్ప ప్రత్యేకంగా పూలపై వచ్చిన సాహితీరచనలు తక్కువే. ప్రకృతిలో ఉన్న పరిమళాలను అక్షరాలుగా మలిచి, వాటిని మాలగా గుచ్చిన పొత్తూరి వారి ఈ కవితాకృతి కచ్చితంగా తెలుగు పాఠక ప్రపంచానికి పూలవిందవుతుంది. సునిశిత, సుగంధ, సుకుమార, వర్ణ, వయ్యార,రమణీయ తేజోభాసితాలయిన పూలను సుగంధ దృశ్యాలకి కమనీయ భావాల వర్ణనలకు అలంకారంగా చెప్పడానికి పువ్వులతో సరిపోలుస్తారు. అలాంటిది పువ్వుల గురించే చెప్పాలంటే నిజంగా! ఓ సాహసమే. ఆ ప్రయత్నాన్ని విజయవంతం చేయడానికి సుబ్బారావుగారు గాలిలో ఒక్కోసారి భ్రమరమై, మరోసారి రెక్కలు కట్టుకొని సీతాకోకచిలుకై, ఇంకోసారి మకరంద అన్వేషి తేనెటీగై... ఎన్నిసార్లు? పూలవనాల చుట్టూ చక్కర్లు కొట్టారో! నిజంగా పూలతో మాలను అల్లినట్లే ఈ 'సుమసోయగాలు'ను అక్షరబద్ధీకరణం చేశారు.

బాల్య స్మృతై గుబాళిస్తుంది. పూదోటలోని రకరకాల పూలను వర్ణిస్తూ.... వాటి అందాలను ఎవరైనా దోచేస్తారేమోనని వాటికి ఎర్రని మందారాలు పహారా పెట్టిన కవి చమత్కారం భేష్!'సేద్యం చేయగల చేవవున్న కర్షకుడికి ఏ నేలమటుకు తలవంచదు?' అంటూ రైతు శ్రమను అగ్రభాగాన ఉంచడం ఎంతో సముచితం. 'మల్లెలని అంగడిలో గుమ్మరించినా బుట్ట ఇంకా గుబాళిస్తూనే ఉందని' అంటారు కవి. మల్లెల సువాసనలు గురించి ఇంతకు మించి ఏం చెప్పగలం? సర్వం వ్యాపారం చేస్తున్న ప్రపంచీకరణను నిరసిస్తూ.... 'తమకి ఒళ్ళంతా ప్రపంచీకరణ పులుముతున్నారని' పూలు గుసగుసలాడే తీరు చూస్తే గుర్రం జాషువాగారు గబ్బిలంతో శివుడికి వర్తమానం పంపిన సంఘటన గుర్తుకొచ్చింది. 'కనకాంబరాలు దవనంతో కూడి, వధువు సిగలో చేరి, అటు అందాలు ఇటు సుగంధాలు పంచుతూ, పెళ్ళికి వేళయిందంటూ పలకరించటం మనోహర వర్ణన' 'సుమాలు వనంలో ఉన్నన్నాళ్ళూ పర్యావరణ విందు చేస్తాయంటూ పూలు కొయ్యొద్దని సున్నితంగా చేసిన సూచన ప్రకృతి పట్ల ఆయన బాధ్యతను తెలియజేస్తోంది. పూలజడలు గురించి చెబుతూ..... 'జడల భారం భరించలేనంటూ విరబోసుకున్న జుట్టుతో....?' అన్న కవి మాటలు సహజత్వమెప్పుడూ ఉనికి కోల్పోదంటూ నవనారీమణులకు చిన్న చురక వేశారు.

'అన్ని రకాల పువ్వులు కలిపి మాలగా గుచ్చితే ఎంత సొబగులద్దుతుందో, అన్ని వర్గాల మనుషులు కలిసి బతికితే సమాజంకూడా అంతే అందంగా ఉంటుందని' చక్కటి ప్రయోగం చేశారు పొత్తూరివారు.






'వధూవరుల పెళ్ళి తంతులో పూల చెండుతో బంతులాడటం' గురించి వర్ణన, మన సంప్రదాయాల్లో పూలవాడకం గురించి గుర్తు చేస్తోంది. 'పూల పుప్పొళ్ళను చుంబిస్తూ వాటిలో మకరందాన్ని గ్రోలుతూ తేనెటీగలు దొరల్లా సంచరిస్తూ తేనెతెట్టెలు పెడుతుంటే, మనం ముసుగు వేసుకొని దొంగల్లా వాటిని సేకరిస్తామని' సుబ్బారావుగారు విసిరిన వ్యంగ్యాస్త్రం బాగుంది. 'దసరాకి బతుకమ్మకి, సంక్రాంతికి గొబ్బెమ్మకి, అట్లతద్దె గౌరమ్మకి కిరీటాలు ఈ పూలే కదా' అంటారు. పైసా ఖర్చులేకుండా..... పూలమార్కెట్‌కు వెళ్ళి రకరకాల పూల సువాసనలు దర్జాగా ఆఘ్రాణించొచ్చు. దీన్ని ఎవరూ అడ్డుకోలేరని చెప్తూ పరిమళ హరణం నేరంగా కాదని సెలవిచ్చారు. తీగమొక్కకు పందిరిపై విచ్చుకున్న పూలు, చంద్రునికాంతికి ఆకాశంలోని నక్షత్రాల్లా మెరుస్తున్నాయన్న భావన బాగుంది. హేమంతంలో పువ్వులపై కురిసి మురిసిన మంచు బిందువులు సూర్యకాంతికి మెరుస్తూ పూలకు సరికొత్త అందాలను అద్దుతున్నాయని చెప్పడం కవి నిశిత పరిశీలనకు మచ్చుతునక.

పువ్వుల్లో రాణి పువ్వు గులాబీ అందాన్ని వర్ణిస్తూ తెల్ల గులాబీని ఎవరో సౌందర్య రాశి ముద్దాడితే ఎర్రబడిందని కల్పిత కథ చెప్పినా, అందులోనూ గులాబీ అందమే కనిపించింది. తెలుగుతల్లి మెడహారంలో శ్వేత సౌరభం ఇప్పుడు ఆంధ్రరాష్ట్ర అధికార పుష్పమై వర్ధిల్లుతోందని మల్లె పువ్వు గురించి చక్కగా వివరించారు.

ప్రచండ భానుడి ప్రతాపాన్ని లెక్కచేయకుండా, ఎర్రని ఎండల్లో మిట్టమధ్యాహ్నం పూచే తెల్లని జాజులు, గ్రీష్మతాపాన్ని నెట్టేసి, చల్లని హాయిని జోగుతాయని జాజుల గొప్పతనాన్ని వివరించారు. గడ్డిపూల అందాన్ని, కాగితం పువ్వుల సౌందర్యాన్ని, లిల్లీపూల లాలిత్యాన్ని, దిల్ బహార్‌ల ముచ్చట్లను కవితల్లో కనువిందు చేశారు. ఉదయాన్నే చెట్టు చుట్టూతా రాలి నేలనిండా పరుచుకున్న పారిజాత పువ్వుల గురించి చెబుతూ తమకి ఆధారాన్నిస్తున్న భూమికి పుష్పాభిషేకం చేస్తూ కృతజ్ఞతలు ప్రదర్శిస్తున్నాయంటారు.

చామంతులు శరదృతువులో వెన్నెలతో దోబూచులాడి, హేమంతంలో మంచు దుప్పటి కప్పుకొని, మధ్యలో బంతిపూలతో సయ్యాటలాడి మధుమాసానికి మాయమైపోతాయట. అబ్బుర పరిచే డాలియా పూల సొగసులు, కనువిందు చేసే రాఖీ పూల కాంతుల్ని, అరుదైన ఆంథోర్యం ప్రేమపూలగురించి, ఊసరవెల్లిలా రంగులు మార్చే పాన్సిటీయా మొక్కల వైవిధ్యం గురించి చదువుతున్నట్లు కాకుండా కళ్ళముందు కదలాడుతున్నట్లు కవిత్వీకరించిన తీరు మహాద్భుతం.

సమాజంలో రుగ్మతలపై పోరాటం చేస్తూ, మంచిని చాటడానికి ఒక్కొక్కరిదీ ఒక్కో బాణీ. ఆ కోవలో పొత్తూరి సుబ్బారావుగారు ఈ 'పూలాంకృతి'ని సుమసోయగాలు చేయడం ముదావహం.

కేవలం సుమాల వర్ణనే కాకుండా తమ సామాజిక బాధ్యతను మరచిపోకుండా కొన్ని ఆధునిక పోకడలపై సుతిమెత్తగా సద్విమర్శ చేస్తూ, పూలు, వాటి రకాలు, అవి పుష్పించే ఋతువులు, వాటి ధర్మాలు చక్కగా వివరించే విజ్ఞాన గ్రంథం ఈ వచన కవితాకృతి. పూల తోటనుంచి మొదలుపెట్టి వేపపువ్వుల జాతర వరకు తీసుకెళ్ళిన ఈ పుస్తకంలోని యాభై కవితల్లో దేనికదే వైవిధ్యం కావటం గమనార్హం. అక్షరాల సుమాలు ఏరుకుంటూ, అనుభూతుల సుగంధాలు ఆఘ్రాణిస్తూ..... మిమ్మల్ని మీరే మైమరచిపోయేటట్లు చేసిన పొత్తూరి సుబ్బారావును అభినందిస్తు న్నాను.

**ప్రతులకు:** సాహితీకిరణం,
ఇం.నెం.11–13–154, అలకాపురి,
రోడ్ నెం.3, హైదరాబాద్–500102.
సెల్:9490751681



–చిలుకూరి శ్రీనివాసరావు
సెల్:8985945506

## కనిపించని నావ

నావను చూసిందెప్పుడు
పనికి రాని కాగితం ముక్కలు మడిచి చిన్నప్పుడు
వాననీళ్ళలో దొర్లిపోయే నైపుణ్యం నావ అన్నప్పుడు
అచ్చం ఆకాశంలో ఒక వెలుగు ముద్దను చూపిస్తూ
కోసం కోటి కోరికలు అమ్మ వల్లెవేసినట్టుగానే,
మరిపించి బులిపించి జీవితం గోరుముద్దలకు నాంది పాడినట్టుగానే
అవునేమో అనుకుంటాము.

తెలిసీ తెలియని పసిదనం పచ్చదనంలో
అక్షరాలు దిద్దిస్తున్న పెద్దరికం
న అంటే నావ అంటూ రంగుల బొమ్మనొకదాన్ని
పుస్తకం పుటల్లో పరిచయం చేసినప్పుడు
గుండెగోడల మీద గీసుకున్న చిత్రం
సముద్రాలనూ నావలనూ తలపోస్తూ వడపోస్తూ

కళ్ళెదురుగా కనికట్టు చేస్తూనే ఉంటే
నిశ్శబ్దాన్ని ముద్దచేసి నావలా మార్చుకు పయనిస్తూనే పోతాము.

ఊహ తెలిసి వెండి తెర సొబగుల్లో ఒదిగిన పడవలూ నావలూ,
సముద్రాలూ ఉప్పెన కడిగిన తీరాలు కళ్లముందుకు వచ్చి నిల్చున్నాక
కనిపించే నావకూ కమనీయ భావనలకూ మధ్యన పుట్టిన మంచు లోయ
అచ్చం పెదవి చివర అణగారిన భావాల అలజడికీ, వెనక్కు తిరిగిన సముద్రానికీ

అడ్డం నిలుచున్న గుండె అలికిడి లానే వెలతెలా బోతుంది
నిజంగా పెద్ద నావలో సముద్రం మధ్యన ఉనికిని బేరీజు వేస్తూ
ఆకాశానికీ జలరాశికీ మధ్యన ఎవరికి వారు కనిపించనంత మసక వెలుతురులో
జీవితాన్ని లిప్తలుగా ఒంపుకు నిదానంగా సిప్ చేస్తున్న అనుభూతికి
మాటలకూ మనసులకూ తావులేకుండా మనసు నదిగా మారి
నావ వెతుక్కున్నట్టు అంతూ దరీ లేని అన్వేషణ నిలవనీయదు

తీరాలు వదిలి చుక్కాని అవసరం లేని నావలై
ముందుకో వెనక్కో వలయాలు వలయాలుగా సాగిపోతున్న వేళ
కనిపించని ప్రతి నీటి చుక్కా సముద్రమై
మడచిపెట్టిన ఊహలు నవ్వులతో నావలు గా చేసి వదులుతూ
నదీ నావా చిరకాల నేస్తాలతో పరాచికమే ఉనికి



–స్వాతి శ్రీపాద
8297248988

## అంతా మన ప్రారబ్ధమే...

చావు కూడా పెళ్లిలాంటిదే అని
నువ్వన్నట్టు నిజమే సుమీ
నిలువెత్తు మనిషే పోయాక
ఈ కర్మకాండ క్రియలేందని పిచ్చింది
ఏడ్పులు ఆర్పులు ఒక వైపు
అంతిమయాత్రకు
ఏర్పాట్లు మరో వైపు
హడావుడి అంతా ఇంతా కాదు.

పెళ్లికి ఇంటిముందు టెంటేసినట్టు
వచ్చిపోయే వారికోసం దీనిక్కూడా..
వివాహ క్రతువులో అగ్నిహోమంలా
ఇక్కడా నాలుగు కట్టెలు తగిలేసారు.

ఏది శుభ అశుభాలు
చావు పుట్టుకలు చలన చక్రాలయ్యాక
చావుకూడా పెళ్లి లాంటిదే
దు:ఖం ముక్తాయింపే
కంకబొంగులు బొంగిప్యాలాలు
గులాలు అత్తరు జలాలు
తలంబ్రాలుగా చిల్లర నాణాలు
కాల్చటానికో పూడ్చటానికో
సవాలక్ష సామాగ్రి తంతులు
ఎటువురికేది..ఎవడు తిరిగేది
తోడుదాడులేని
బ్రతుకులు కోకొల్లలాయే
ఇప్పుడు జగమంతా నిలకడలేనిదైంది
దూరాలనుండి
బంధువుల రాక ఓ ప్రహసనం
చావైనా పెళ్లైనా క్షణాలమీద అయిపోవాలి
కొన్ని నిట్టూర్పులు కొన్ని ఓదార్పులు
మళ్లీ మన దిన చర్యలోకి జారిపోవాలి.

అందుకేనేమో..
బహుళజాతి సంస్థల్లో కొత్తపుంతలు
కర్మకాండా డాట్‌కామ్
ఇప్పుడు ఇంట్లో ఎవరు పోయినా
హైరానా పడనవసరం లేదు
నలుగురూ నాలుగు దిక్కులా
పరుగులు తీయనవసరం లేదు
బంధువులు రాబంధువులూ
అవసరం లేదు
మోయటానికో చివరి మాటలు
చెవిలో కూయటానికో
నలుగురు వ్యక్తులు రానవసరం లేదు
నాలుగిర్రల బండితోసహా
కర్మకాండ సామాగ్రి సిద్ధం
పార్థివ దేహాన్ని
కడదాకా మోసుకెళుతుంది.

కాలం బిగించిన పిడికిళ్లమధ్య
మార్కెట్టయిపోయిన
అంతిమయాత్రా దృశ్యం
ఎన్ని హృదయపు
కళ్లను తెరిపిస్తోందో

ఇప్పుడిక
అంతా శాంతమే కదూ..
అంతా ప్రశాంతమేకదూ
అంతా మన ప్రారబ్ధమే కదూ..!



– డా.కటుకోఝ్వల రమేష్
సెల్:9949083327

# కాలం విసురుతున్న ఉలి దెబ్బలు

బాల్యమంతా గొడ్డు గోద తోటి
శేను శెల్కల పొంటి భారంగా గడిచింది
బలపం పట్టుకొని బడి తోవ కంటే
కాడి మేడితోటి కాలమెల్లి పోయింది
పగటి పూట ఆకలి రాకాసి రంకెలేస్తుంటే
ఊస బియ్యం ఊదుకుంటూ తిని
శెలిమల నీళ్లు తాగి సేదతీరిన రోజులు ఇంకా
నా మది నిండా మెదులుతూనే ఉన్నాయి.

నా బతుకంతా ఆటుపోటుల సంద్రమే
సర్కస్ లో తీగపై నడిచే వ్యక్తి చందమే
కన్నీళ్ల సుడులను కనురెప్పల మాటున దాచుకుంటూ ,
మాటల ఈటెలకు వరి కంకిలా వంగిపోకుండా
కష్టాల వాగులో ఎదురెక్కిన చేపను నేను

ఎదలో రగిలిన కోరికలను కొట్టంలో
కట్టేసి కండ్లను కాగడాలుగా చేసుకొని
పుస్తక ఆకాశంలో అక్షర చుక్కలను
ఏరుకున్న ఉషోదయ కిరణం నేను

మాట్లేసిన లాగులు, పల్లుబట్టిన అంగీలు పాదాలకు
పాద రక్షకాలు నోచకుండా కళాశాలకు కదిలిన
రోజులను, గండి పడ్డ గుండెను ఓదార్చుకుంటూ ,
కన్నీటి బిందువులకు ఆనకట్ట వేసుకుంటూ
కథనరంగమై కదులుతున్నాను.

పండగకు నాన్న దాచుకున్న ఒక్క పంచెను చింపి
నా ఒంటిమీదకి అంగిగా మార్చిన
మా అమ్మ చేతులు ఇంకా నా కండ్ల ముందు
కదలాడుతూనే ఉన్నాయి.

అమ్మ చెప్పిన కష్టాల కథలు
నాన్న ఒంపిన ధైర్యపు ఫిరంగులతో
దిగులు తెగులును తగలబెట్టుకొని
జ్ఞాపకాల బొంతను కప్పుకొని
జీవిత చక్రాన్ని లాగుతున్నాను
కాలం విసురుతున్న ఉలి దెబ్బలకు
నాకు నేను శిల్పంగా మారుతున్నాను.



-తాటిపాముల రమేష్ (తార)
7981566031

# సత్యాన్వేషణ

బ్రతుకు బాటలో...
యుగాలుగా నడుస్తున్నా!
కోరికల సమాధులు దాటుతూ..
అందని ఆశల నక్షత్రాలని
ఆకసంలో చూస్తూ...
అపుడపుడు హోరెత్తే జనాలమధ్య...
అయినా అరణ్యమే!

నారుపోసి నీరుపోసి పెంచిన వృక్షాలు
వీస్తున్న వడగాల్పుల సెగలో
ఎచటినుండో వీచే చల్లని
పిల్లతెమ్మెరకై అర్రులుచాచి
ఎన్నాళ్లీ నిరీక్షణ?

హాలాహలం దాటినా
అమృతబిందువు ఆనవాలు దొరక్క
ముళ్లబాటలో

ఒక్క గడ్డిపువ్వు జాడ కానక
ఎక్కడికీ పయనం?

నేనెరిగిన జీవితసత్యాలు
బోధివృక్షం చెప్పని జ్ఞానాలు...
ప్రోదిచేసుకుని వెళుతున్నా!

నిన్నటిదాకా పరులకొరకు వెచ్చించిన
జీవితం వదలి
ప్రతిక్షణం నాకోసం నేను
బ్రతకటానికై
సత్యాన్వేషినై
పడమర దెసకు పయనం ప్రారంభించా
నా వెనుక
తూరుపు వెలుగులు
మీకోసం వదిలేస్తూ....



-లలితావర్మ
9949672671

# చిరంజీవులు

దేశానికి ప్రాణమిచ్చి
దేహాన్ని లెక్కచేయని చరిత్ర మీది
మీ త్యాగాలను
ఏ తూనికరాళ్ళతో కొలవగలం ?

దేహమొక్కటే
ప్రాణమూ ఒక్కటే ఎవ్వరికైనా
బంధాలూ
అనుబంధాలతో సాగే
బతుకుబండే ఎవరిదైనా
తీగల్లా అల్లుకున్న బంధాలనొదిలి
ప్రాణాల్ని గాలిపటాల్లా పైకెగరేయడం
నీకంటూ గుర్తింపునిచ్చిన దేహాన్ని
మాతృభూమి మట్టిలోనే కలిపేయడం
మీకుతప్ప ఇంకెవరికి చెల్లు
మీరెప్పుడూ చెరగని జ్ఞాపకమే

మీరెప్పటికీ స్ఫూర్తి ప్రదాతలే
మీరు తెచ్చిన స్వాతంత్ర్యపు వెలుగులో
దేశమిప్పుడు దారివెతుక్కుంటుంది
మీరిచ్చిన స్ఫూర్తితోనే
దేశమిప్పుడు నడకనేర్చుకుంటుంది
మీరు నిర్దేశించిన ఆశయాలే
దేశాన్నిప్పుడు శిఖరాగ్రాన
నిలబెడుతున్నాయి
సగర్వంగా నిలబడే దేశ సౌధానికి
పునాది రాళ్లు మీరు
తరాలు మారినా,యుగాలు మారినా
మా గుండెల్లో
చిరకాలం కొలువుండే
చిరంజీవులు మీరు



-ఎన్. నరేశ్ చారి
9701334516

పుస్తక సమీక్ష

# వైవిధ్య అనుభూతులమాలిక....సప్తపర్ణిక




మేథోమదనంతో ఉద్భవించిన అమృతాక్షరాలు కవితలైతే ,మనోసంఘర్షణతో పురు డోసుకున్న అక్షరాలు మహాకావ్యాలై ప్రతీ మనసులోకి చేరిపోతాయి....అలాంటి భావా గర్భిత కవనాలను కూర్చి , అరవై కవితల అందాల కవనకన్యకగా..మనముందుకు చేరినదే ఈ సప్తపర్ణిక.... వనితారాణి గారి భావమా లిక...

"ముగ్ధమోహన రూపంతో మురిపాలు పంచుతూ.మగని సరసన రసకేళిలో మరుమల్లి" గాసున్నితమైన భావాలను అలవోకగా అక్షరాలలో ఒంపే సుదతే కాదు..సామాజిక రుగ్మతలను ఎత్తి చూపుతూ కవనసాగు చేసే హాలిక వనితారాణి గారు.....వీరిఅక్షరాలు మదిగదు లను సంతోష కుసుమాలతో నింపేస్తా య్..మనసులో కల్లోలాన్ని దూరం చేస్తాయి... ద్విగుణీకృత భావాలకు రూపమిస్తా య్...ఆలోచనలసాగుతో భావాల పంటను పండిస్తాయ్...ఇక వీరి మనసైతే..నీటిలో ఈదినా దాహంతీరని చేపపిల్ల. జడివానలో తడిసినా మునగదు.నందనవనంలో తిరిగినా గుభాళింపునెరగదు...చెప్పలేనన్ని ఊసులకు కార్ఖానైననూ...పెదవిగడపలోనే దాచి మగ్గిపోయేది అంటారు...

ఇంక వీరికవిత్వం పల్లెతల్లి ప్రేమను చూపగలదు...వలసబ్రతుకుల పాట పాడ గలదు.. ఎండగట్టిన బంధాల నడుమ ఎండమావులను చూపగలదు...సమస్యల సునామిని ఎదుర్కొనేవేళ తలెత్తుకుని నిలు చోగలదు...ఇక అనుభూతుల వరదలు పారిస్తూ వీరు రాసిన కవితలలోకి వెళ్ళినట్లయితే...

"కనులు మూసినా భయమే కంటికొలకల్లోంచి కరిగిపోతావే మోనని...కనులు తెరిచినా దిగులే.. తెరిస్తే స్వప్నమై జారిపోతావేమో " అంటూ.. ఒకపక్క విరహ రాగాలాపన చేస్తూనే ...మరోచోట "నేలతల్లి కడుపులో నవరత్నాలు పండించేప్రాణమొకటి...రత్నాల రాసులకు రాజులుగా జులుం చేసి దక్కించు కునే కండకావరమొకటి" అంటూ వర్గ సంఘర్షణను నిక్కచ్చిగా చూపుతూ..."పాలేగాడి పానం " కు ఊపిరిపోశారు..

చీకటిగృహాల్లో చితికిపోతున్న అతివలందరి మనోవేదనకు అద్దం పడుతూ.. వనిత గారు అందించిన తనోవేశ్య ఎంతో హృద్యమైన కవిత...ఈ కవితలో..."ఇంటిపెద్ద తన బాధ్యతను విస్మరించినపుడు ఆమె ఇంటిని కూలకుండా కాపాడే ఇంటిదూలం " అంటూ వారి ఔన్నత్యాన్ని తెలుపుతూ..ఇదే కవితలో..."తనవారికై తనువు తరాజులో పెట్టినప్పుడు ఆమె ఓ అంగడి సరుకు" అంటూ వారి దయనీయ స్థితిని చాటారు...

"ప్రతి వీధికుక్క తనకోసం అర్రులు చాచి ఆశగా చూసినపుడు తనో ఉగ్రకాళి" అంటూ వారి తెగువను చూపుతూ..."కన్నుల్లో బడబాగ్నిని కవ్వించే కైపుగా ఏమార్చి మత్తెక్కించే ఆమె మొత్తంగా కొందరికి ఇప్పుడు తనోవేశ్య" అంటూ ఆలోచింపజేసే ముగింపునిచ్చారు....

పురుషాధిక్య సమాజంలో...ఆడవాళ్లు ఎదుర్కొంటున్న వివక్షతలను వివరంగా చూపుతూ...వీరు రచించిన గొప్పలదిబ్బ కవిత ప్రతీ ఒక్కరినీ ఆలోచింపజేసే కవిత "పిండంగా ఉన్నప్పుడే ఆడ నలుసు లంటే ముక్కలే గర్భకుహరంలోనే.అదృష్టం బాగుండి కన్ను తెరిచిందా ఇక ఆంక్షల చి(చ)ట్టాలు అమలే" అంటూ వీరు ఈకవితను ఎత్తుకున్న తీరు నిజంగా మనసున్న ప్రతీమనిషిని ఆలోచింప జేస్తుంది. ఇంకా ఈ కవితలో...అడుగడుగునా ఆడకూతుళ్ళు ఎదుర్కొంటున్న అణచివేతను చూపుతూ "ఒకయ్య చేతిలో పెట్టేసి చేతులు కడిగేసుకున్నాక..చేతిలోకి తీసుకున్న తోడు కాళ్ళకు ప్రేమసంకెళ్లు వేయగా అబ్బో ఆడపుట్టుక ,గొప్పలదిబ్బ మరి " అంటారు..ఆమెప్రతిభను బూడిదలో పన్నీరుగా చేసే ఈ లోకంలో "అసమానతలు ఆగేదెప్పుడో తెలుసా ఆ రుద్రభూమిని కౌగిలించుకున్న ప్పుడే." అంటూ చక్కటి ముగింపుతో వాస్తవాన్ని చాటిచెప్పారు...

సృష్టిలోని ప్రతీపుట్టుకకు గల చరితార్థాన్ని తెలుపుతూ రాసిన కవిత. " పుస్తకంలో నాకో పేజీ"

"ఎందుకు ఈజన్మని ..ఎవరికీ పనికిరాదని వగచేవు ఓమనసా....
ముళ్ళకంచెనని రోదించక తావిలా మారు తీవెలకి...
మన్నులా ఉన్నానని దస్సిల్లక జన్మనివ్వు రేపటి తరానికి..
కర్రముక్కనని కన్నీరు పెట్టక..వెదురులోని వేణువవ్వు..రాగలహరిలో రంజింపజేయగా " ఆహా ఎంత అద్భుతమైన వ్యక్తీకరణ....! కవి తలచుకుంటే...వృక్షరాజముల హృదయాన్ని ఆవిష్కరించ గలడు. పంచభూతాల మనసును సాక్షాత్కరించగలడు ...అనేదానికి ఇంతకన్నా నిదర్శనం ఇంకేమైనా కావాలంటారా....?ఈ కవితలో ఇంకా...చరిత్రను "తిరగరాయలేవేమో గానీ...నీ జీవితానికి నీవేగా పాళీ...పుస్తకంలో నాకో పేజీ అంటూ..నీ జీవితపుటను పొందుపరచుకోగలవు ఓ మనసా." అంటూ సందేశాత్మక కవితనందించారు.

స్త్రీ వాదాన్ని బలంగా వినిపించిన వీరి కవిత్వంలో ....అడుగడుగునా తన అస్తిత్వానికై అతివ చేసే పోరాటం కనిపిస్తుంది... ఇందుకు గొప్ప ఉదాహరణే "అనామిక " కవిత.. "పుట్టగానే ఆడపిల్లవి. ఈడు పలకరించగానే నాన్న గుండెల్లో కుంపటివి."ఎంత హృద్యమైన వ్యక్తీకరణో కదా...ఇంకా వీరు ఈ కవితను కొనసాగించిన తీరు...కంటి కొలనులో కన్నీటి అలజడిని చూపిస్తుంది...

"అతిప్రేమకు అందిన కానుకగా చరమాంకంలో చాదస్తానివి ,కలుక్కుమన్న గుండె గాయానికి ,కరకట్ట తెగని కన్నీటి సంద్రానివి....వెనక్కి తిరిగి చూస్తే అస్తిత్వం ఆనవాళ్లు మచ్చుకైనా అగుపించని అనామకవి" అని మగువ వేదనను కళ్ళకుకడుతూనే...

"చాలు...ఇకచాలు..మగతనిద్రను వదిలించుకో...వొగరుబంధాలను విదిలించుకో" మంటూ మహిళా లోకాన్ని మేల్కొల్పారు... ధీశాలి కవితలో మహిళాభ్యుదయం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందనడానికి...ఈ క్రింది ఫంక్తులే నిదర్శనం.." ఆరళ్లపర్వాలు చేసే అంతర్గతగాయాలు... అవమానాల బాణాలు చేసే ఛిద్రాలు. అనుమానపు పెనుభూతం పీల్చే రక్తపుబొట్లు...అంతరాళంలో అగ్నిపర్వతం బద్ధలవుతున్నా బాధ్యతల చట్రంలో బంధీగా చిక్కినా ఆమె ఓ ప్రభంజనం. మహిళా సాధికారత దిశగా అడుగులేసే ఆయుధం× అంటారు.ఆమె భావోద్వేగం ప్రభాతకిరణమై లోకాన్ని తట్టిలేపుతుందనడానికి ఇంతకన్నా.ఇంకేం కావాలి మరీ. పురిటిగుడ్డును పెంటపాల్జేసిన అమ్మతనానికి ప్రశ్నలబాకులు విసిరినకవిత "ఓఅమ్మతనం" "నువ్వప్పుడే తెంపుకున్న బొడ్డుతాడు చీమలకు విందైన వేళ .. ముర్రుపాలు రుచిచూడాల్సిన నా చిట్టిపెదాలు రక్తాలోడుతున్నాయి " ఎంత హృదయవిదారకమో కదా. "పున్నామనరకం నుంచి తప్పించలేనలా ..వాడెవడో నీయవ్వనాన్ని వాడుకుని వదిలేస్తే నీ భవితకు అడ్డుగోడనవుతాననా" ఎందుకు వదిలేసావంటూ రోదించే ఆ చిట్టికూన పాత్రలో ఒదిగి కవిత రాసిన తీరు శ్లాఘనీయం...

సున్నిత ,సుకుమార సుదతుల హృదయావిష్కరణ చేస్తూ.... మల్లియలము మేము మల్లియలము అంటూ ఉత్తుంగతరంగంలా అందించిన గేయకవిత....పరోపకార గుణాన్ని ఈవిధంగా సాక్షాత్కరింప జేసింది..."మల్లియలము మేము విరిమల్లియలము...కన్నతావి నించి విడదీసి తెచ్చినా ,కమ్మగా పూచే మల్లియలము... బలవంతపు బంధముతో ఉరివేసి అల్లినా..సౌరభాలు పంచే మల్లియలము నలిపి వేయకురా నరుడా మెడలు వంచి...మగువ మానసమునకు మరురూపాలము " అంటూ చక్కటి కవితనందించారు....

ఇంకా వీరి కవితలలో కలికితురాయిగా చెప్పుకోదగినది..సంభాషణ రూపకంగా సాగిన"తొలకరి కవిత"

"ఒక్కసారి బోరున ఏడ్చి బెంగ తీర్చుకొమ్మని నేనన్నాను....లేదు జ్ఞాపకాలు నెమరేసుకుంటూ ఒక్కో కన్నీటిబొట్టు రాలుస్తానంటుంది .పుడమితాపం నీకన్నీళ్లే తీరుస్తాయని నేనన్నాను...స్వాతిచినుకులే ప్రియమారా తడపగలవని తనంటోంది."

ఇలా వైరుధ్యమైన భావాలను వైవిధ్యంగా చెప్పడంలో కవయిత్రి నైపుణ్యం కడుప్రశంసనీయం....

ఇక ప్రణయసంకీర్తనలు ఆలపిస్తూ...."నీచుట్టే నా ప్రాణం.. ప్రేమఖైదీ..మందస్మితనై..సంసారం ఓ మనోహరకావ్యం..రాగిణినై." వంటి కవితలు వీరి కలంనుండి జాలువారగా...మరోకోణంలో వీరు రాసిన కవిత..."" ముల్లై గుచ్చునంతదాక "పాఠకులను ఆలోచింపజేస్తుంది.

"పూలబాటే ఇద్దరిపయనం మూడుముళ్లు ముల్లై గుచ్చునంత దాకా..అహం అడ్డుతెర కావద్దు..అన్యోన్య దాంపత్యానికి వివాహ బంధాలపాలిట.".అంటూ తాళిని ఎగతాళి చేసే వారికి చెంపపెట్టు లాంటి కవిత నందించారు.

"ఊపిరాడనివ్వని క్షణాలు" కవితలో..చెల్లిని గుర్తుచేసుకుంటూ...అనంతవాయువుల్లో ఐక్యమయిన అరంజ్యోతిని తలచుకుంటూ .." పెళ్లీడుకొచ్చిన పరువాన్ని ప్రేతాలపాల్జేసి..ఉరికొయ్యను వేల్లాడి ఉనికి కోల్పోయావు".. అంటూ రాసిన ఫంక్తులు పాఠకుల గుండెను పిండేస్తాయి..

ఇంకా వైవిధ్యమైన శీర్షికలతో అభిసారికనై...సకళ కళా వల్లభ...ఎరేసర్ లేక ..తెలంగాణ గాయాలవీణ . మానరక్షకయజ్ఞం ,మృత్యుకుహరం వంటి కవితలెన్నో పాఠకులను ఆలోచింపజేస్తాయి...

మొత్తంగా వనితారాణి గారి కవిత్వంలో...అంతులేని కథలా సాగే ఆడవారి జీవితంపై ,వ్యక్తిత్వంపై సాగే కవితలు దర్శనమిస్తాయి...సున్నితమైన భావాలతో వీరు రాసిన కవితలన్ని పాఠకులను రంజింప జేస్తాయి...మున్ముందు వీరి కలంనుండి మరిన్ని మంచి కవితలను ఆశిస్తూ...సప్తపర్ణికను మనసారా స్వాగతిద్దాం...

ప్రతులకు :
వనితారాణి నోముల
9666740424,
7396320424
సమీక్షకురాలు: శ్రీమతి స్వప్నకృష్ణ
కవయిత్రి,కరీంనగర్
9440536669



-డా॥వైరాగ్యం ప్రభాకర్
9014559059

# బడిబస్తా

బుడి బుడి అడుగుల చిన్నారి
బడికేగె ఆసక్తిగ తొలిసారి
పలకబలపంతో గురువు చేరి
దిగే అక్షరాభ్యాస బరి.

వర్ణమాల ఆకారాలు
అనురక్తిగా బోధించు గురూ
ఏకాగ్రత పరికిస్తూ,
పరవశించే పలవరిస్తూ.

మిత్రబృందం తో కలిసి
ఆటపాటల్లో అలిసి
పెన్సిల్ రబ్బరే దోస్తి
అదే పెద్ద ఆస్తి.

పెన్సిల్ గీతల తప్పులు
సరిచేసే రబ్బరు
వాడిచేసే షార్పెనరు
జీవితానికి అన్వయించుకొనె
పెన్నుతో రాసే రాత,
చెరపరాని గీత,

రంగు పెన్సిల్లతో కాగితం
అవుతుంది ఇంద్రచాపం
జీవితసారం ఒంటబట్టే,
జ్యామితి పరికరాలు చెప్పే,
పక్కా పరిపక్వత నిర్ధిష్టత
జీవిత ఆలోచనలు

చూచిరాత నోటు పుస్తక సూత్రంతో
మంచిని మాత్రమే పాటించె
పలువిషయ చర్చల్లో
జ్ఞాన సింధువు వైశాల్యం కొలిచె.

అవసరం తెలుసుకొని
తన బాధ్యత నెరిగె ,
పరీక్షల అట్ట రాతకు ఊతం
శిక్షణ నిచ్చుటలో గురువు ప్రీతం

కాదు బరువు బడిబస్తా
అది చూపును జీవితపు రస్తా
అభ్యసన ఉపకరణాలతో
గురువు సన్నిధి
అదే విద్యార్థి
భవితకు పెన్నిధి.



-సంధ్య సుత్రావె,
9177615967

# ఏది శాశ్వతం?

ఈ జీవితం శాశ్వతమా
ఈ ప్రాణం శాశ్వతమా
అశాశ్వతమైన ఈ జీవితంలో
నీ ప్రాణానికి ఏమైనా
భద్రత ఉందా?
లేదా, ఎల్లకాలం బతుకుతావన్న
నమ్మకం నీకేమైనా ఉందా??

ఆశాశ్వతమైన ప్రాణం
అంతులేని జీవన గమనం
కానీ నిరంతరం ఒకరిపై
ఒకరికి ఈర్ష్య ద్వేషాలు.

స్నేహితులతో శత్రుత్వం
బంధువులతో వైరం
నా కులం గొప్పదని
నా మతం ఉన్నతమని
విర్ర వీగే తత్వం.

ఎంత సంపాదించాము
అన్నది కాదు గొప్పతనం
ఎంత గొప్పగా బతికాము
అన్నదే ప్రధానం.

బతికినంత కాలం పదవులు, హోదాలు,
సంపాదనలు కాదు శాశ్వతం...!
చచ్చిన కూడా సంపాదించుకున్న పేరు,
కీర్తి మాత్రమే శాశ్వతం..!!

శాశ్వతం కానీ వస్తువులు,ప్రాణాలపై
ఆశలు పెంచుకోకు!
శాశ్వతమైన పేరు వచ్చేలా
జీవితం కొనసాగించు!
అందరి హృదయంలో శాశ్వతంగా
ఉండేలా చిరు స్థానం సంపాదించు!!



-ఎన్.. రాజేష్
9849335757

# లోకమంతా తడిమి చూస్తే

పొద్దు పొడుపుల నేత్రనందములో
ఊసరవెల్లిల చిత్ర కథనాలు తెరలపై
పొడుచు కుంటూనే వున్నాయి !

లేని పోనీ మాటలను రువ్వుతూ
పాదాలకు రెక్కలనుతొడిగి పాదయాత్ర పేరీటా
పరుగు పరుగున బాధలను బాధ్యతగా వింటూ..

ప్రావీణ్య ప్రసంగాలతో ఓదార్పుల రంగులద్దీ
మనోరస మీది రుచిమొగ్గలపై తేనెలను అద్దుతున్నారు !

మాట్లు వేసుకున్న ఛిద్రమైన బతుకు గుడిసెలపై
నమ్మకపు కత్తుల వెలుతురును చల్లుతున్నారు !


బరువైన రోజుకూలీలా కర్షక కార్మిక నెత్తురుపై
పెరిగిన చమురు గాలిపడి రెక్కలువిరిగి
ప్రయాణం దారి తప్పుతుండేను !

సామాన్యులకు జీఎస్టీల బేరీజూలో
సద్దెన్నం ముద్దకు పసిప్రాణి మనసుకు
పాలు పెరుగు దూరమయ్యేను !

కులం కత్తుల మీద ప్రసంగాలు చేస్తూ..
మతమనే గంజాయి మత్తును ఎక్కిస్తూ..
వాడి వేడి చర్చలతో చిత్ర తెరలపై చూపిస్తూ..
అగ్ని పర్వతంలా రావణ కాష్టంలా మార్చి
చరిత్ర పేజీలపై నిలిచిపోతుండేను !


నిశ్శబ్దం నిట్టూర్పును మోస్తుంటే..
అసాంఘిక శక్తుల ఆగడాలు రెచ్చిపోతుంటే..
అంధకార శూన్యము దర్శనమిస్తుండేను !

స్వచ్ఛమైన లోకమంతా తడిమి చూస్తే..
భవిష్యత్తున మూటగట్టిన కాలం తెరిచిచూస్తే..
దుఃఖాలుగా మిగిలిన
ఎముకల చిత్రాలే కనబడుతుండేను !



-డాక్టర్ పగిడిపల్లి సురేందరు
8074846063




సెల్: 9440622781

రెక్కలు రాగానే
గూడొదిలేది పక్షి
గూట్లోంచి కన్నవార్ని
పంపే మనిషి!





నాడు ఊరి మధ్య
పెళ్లి మండపాలు
బయట వల్లకాడు
నేడు తారుమారు!




తన పంట
ఏసీ మాల్‌లో
తాను ఎండలో వానలో
మార్కెట్ గోల్‌మాల్‌లో




రవి కాంచనిది
కవి గాంచును
కవి గాంచనిది
గూగుల్ గాంచును

ఇల్లు పెద్దదే..
సామాన్లెక్కువ
ఏం చేస్తాడు
తల్లిదండ్రుల్ని వెళ్లగొట్టక!





పిట్ట
అద్దాన్ని పొడుస్తోంది
మనిషికీ అదే కావాలి–
ఆత్మ విమర్శ!

# పక్షి సంరక్షణం

పక్షులను చంపకు
రాక్షసుడిగా మారకు
కుక్షిని నింపేది పర్యావరణం
రక్షించేవి పక్షులే కదా ?
వినీలాకాశంలో
విరిసే తోరణాలు పక్షులు
విశ్వవృక్షంపై
గూడ్లు కట్టుకొనేవి పక్షులు
పురాణకథలకు సాక్షులు పక్షులు
రమణీయదృశ్యాలకు
గవాక్షాలు పక్షులు
మోక్షమార్గాన్ని చూపే మౌనులు పక్షులు
బ్రహ్మసృష్టిలో మోహకులు పక్షులు
మానవాళికి సందేశవాహకులు పక్షులు!

డా॥ అంబాచితం నటేశ్వరశర్మ
9440468557.



# శూన్యపు మనసులో చిగుర్లు..

ఆశల వనాల్లో వెలుగు రెమ్మలకి
ధైర్యం అనే చిగుర్లు మొలుస్తుంటే
ప్రవహించే కాలపు మడుగులో
ఎర్రటి చారలు దారుల నిండా కనిపించే...

చీకటిలో మనసు చాలా కాలంగా రోదిస్తుంది
మౌనం తెల్లవారుజాము నిద్రలా కలత చెందే
రమ్యమైన కోయిల కంఠం కఠినంగా వినిపించే
కాలిన మనసులో కలతలు సృష్టించే..

సూర్యోదయ ఉషస్సు నేలపై పాకుతుంటే
కన్నీటి చారలతో ముఖం తడుస్తుంటే
కాలసర్పము తనువంతా పాకుతుంటే
నిశ్శబ్దపు నీడలో ఊపిరి బిగబట్టి బ్రతుకులు...

దురాశ చీకటి అరణ్యములోనికి పోసేసి
అడుగుల శబ్దములలో భయము కనిపించే
గొంతు ఎత్తి అరిస్తే ప్రతిధ్వని వినిపించే
అడవి మబ్బులు కమ్మి ఆశలు తుంచి వేసే...

ఆకాశం సముద్రపు అమృతం ఒలికించే
బీడు వారిన మనసులో అలికిడి మొదలయ్యే
గాయపడిన రెక్కలకు అందాల రంగులు వచ్చే
కొత్త వసంతంలో పాత జ్ఞాపకాలు మరుగున పడే..

భగ్నమైన హృదయములో ఆశల శ్వాసలో
ఆత్మవిశ్వాసం శృతి లయలా మ్రోగుతుంటే
చీకటి బ్రతుకుల్లో వెలుగులు కనిపించే
శూన్యపు మనసులో చిగుళ్ల రెక్కలు తొడిగే..



-కొప్పుల ప్రసాద్
9875066235

# పోరుమెట్లవీణ !!

బానిసత్వ బతుకులకు అద్దం ఈ చరిత్ర
నైజాముల కర్కశానికి కాల్మొక్కిన చరిత్ర
చీకట్లను కమ్మిన దొరలపాలన ధరహాసం
నిజాం నిరంకుశత్వం చేసె వికటట్టహాసం.

సంస్థానాలలో ప్రత్యేకమైన హైదరాబాద్
నిజాములపాలనలో వెలిగె హైదరాబాద్
ఏడవ నిజాము పరిపాలన మొదలాయె
ప్రజలపై నిత్య అకృత్యాలు పెరిగిపోయె

నీచ అరాచకాలకు రాక్షసుడయ్యె రిర్వీ
అధికార మదమెక్కిన మృగమైన రిర్వీ

రిర్వీ దౌర్జన్యాలకు తెగిపడిన తలలెన్నో
రజాకారులకు బలైన మాన ప్రాణాలెన్నో

దొరతనంపైన తిరుగుబాటు బావుటాలు
గళమెత్తెను మండిపడిన పల్లెలగుండెలు
కరవాలములై కదనం చేసెను కలములు
దొరల గడీల గోడలకు పడె ఎర్రని నెర్రలు.

తెల్లసంకెళ్ళను తెంచుకున్న భారతావని
విలీనానికి విముఖతను చూపిన నిజాం
అలీఖాన్ మెడలు విరిచిన సర్దార్ పటేల్
భారతమ్మ నుదుటిబొట్టయ్యె తెలంగాణ

రక్కస పాలకులనుంచి విమోచన కోసం
రత్నగర్భ భరతావని ఒడిని చేరుటకోసం
నేలరాలిన తెలంగాణ అరుణతారలెన్నో
చరిత్రలో లిఖించక చిరిగిన పేజీలెన్నెన్నో



-పేరిశెట్టిబాబు
9247170800

## నానీ

పిల్లస్కూలు మానేసింది
కడుపునెప్పో
తలనొప్పో కాదు
సెల్ జ్వరం!



-యలమర్తి అనూరాధ
9247260206



శ్రీమతి రాజావాసిరెడ్డి మల్లీశ్వరి
అద్భుత రచన




## వర్ణిక

"ఈ లేఖలు రసలేఖలు
మహా ధైర్యాన్నిచ్చే మహా గ్రంథం 'వర్ణిక'
చక్కని చిక్కని కవితా వల్లరి మల్లీశ్వరి 'వర్ణిక'!"
అని ప్రశంసలందుకున్న 'వర్ణిక' గ్రంథ పరిచయ సభ

సిటీ కల్చరల్ సెంటర్, సుదర్శన్ థియేటర్ గేటు పక్కన
ఆర్‌టిసి క్రాస్ రోడ్స్
13 నవంబర్, 2022, ఆదివారం ఉ. 10.00 గం.లకు

సభా నిర్వాహకులు - గౌ. బైసాదేవదాస్
సంపాదకులు, నేటినిజం, దినపత్రిక

వర్ణిక పరిచయకర్తలు
కళారత్న, గౌ. బిక్కి కృష్ణ గారు, సుప్రసిద్ధ కవి, విమర్శకులు
గౌ. వెనిగళ్ళ రాంబాబు గారు, సినీగేయ రచయిత, నంది అవార్డు గ్రహీత
గౌ. ఇసనాక మురళీధర్, కవి, రచయిత
శ్రీమతి విజ్జిక, కవితా స్నేహితురాలు
శ్రీమతి రాధా కుసుమ, కవయిత్రి, రచయిత్రి
గౌ. సంతోష్, కవి, ఉపాధ్యాయులు

ఆహ్వానించువారు
దామరాజు నాగలక్ష్మి

